కార్పొరేట్ల లాభాల కోసం

మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బ

- బడ్జెట్‌లో మత్స్య పరిశ్రమకు అరకొర కేటాయింపు
- ఎఐఎఫ్‌ఎఫ్‌డబ్ల్యుఎఫ్ పార్లమెంట్ మార్చ్‌లో తపన్ సేన్, హేమలత

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 241 | విజయవాడ, మంగళవారం 4 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 4 April 2023 | Rs



చెన్నై బోణీ

- లక్నో సూపర్‌జెయింట్స్‌పై ఘన విజయం

లోపలి పేజీలో..

ముందస్తు లేదు

కష్టపడండి, ఏ ఒక్కరినీ వదులుకోం

- ఆగస్ట్ నాటికి గడపగడపకు మన ప్రభుత్వం పూర్తి
- పార్టీ సమీక్షలో సిఎం జగన్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు, మంత్రివర్గంలో మార్పులు చేర్పులు అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికల ప్రక్రియ వుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఆగస్టు చివరి నాటికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తికావాలని, ఇందుకోసం ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు నెలలో 20 రోజులపాటు ప్రజల మధ్యనే వుండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడాలని ఏ ఒక్కరినీ వదులుకునేందుకు సిద్ధంగా లేమని అన్నారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రీజనల్ కో-ఆర్డినేటర్‌లతో ముఖ్యమంత్రి గడపగడపకు మన ప్రభుత్వం, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గతంలో శాసనమండలి ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఈ నెల 7 నుండి చేపట్టి 20వ తేదీ వరకు కొనసాగించాలన్నారు. అలాగే 'జగనన్నకు చెబుదాం' అనే వ్యక్తిగత సమస్యల విజ్ఞప్తులను తీసుకునే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆగస్టు చివరకు గడపగడపకు మన ప్రభుత్వం ముగియగానే సెప్టెంబరు నుండి మరో కార్యక్రమాన్ని రూపొందించుకొని ముందుకు వెళ్దామని సూచించారు. మరో ఏడాదిలో ఎన్నికలు వున్నందున కార్యకర్తలు అత్యంత క్రియాశీలకంగా వుండాలని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి వేశామని తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో 84 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 87 శాతం కుటుంబాలకు మన పథకాలు అందాయని అన్నారు. 21 మండలి స్థానాల్లో 17 స్థానాలను మనం కైవసం చేసుకుంటే నాలుగు స్థానాల్లో గెలిచిన వారు ఏదో జరిగిపోతోందని భ్రమలను సృష్టిస్తున్నారని అన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు చాలా తక్కువ మంది వుంటారని, మనం అందించే పథకాలు తీసుకునేవారు అందులో 20శాతం మంది మాత్రమేనని అన్నారు. ముందస్తుకు పోతున్నారని, 60 మంది ఎమ్మెల్యేలకు టికెట్లను ఇవ్వరని, మంత్రివర్గంలో మార్పులు చేర్పులు వుంటాయనే దుష్ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని ఆదేశించారు. తెలుగుదేశం మొదటి ప్రాధాన్యతా ఓట్లతో ఎక్కడా గెలవలేదని, రెండవ ప్రాధాన్యత ఓట్లతో గెలిచిందనే వాస్తవాన్ని గుర్తించాలని అన్నారు. వాపును చూసి బలంగా అనుకుంటున్నారని ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు మన వెన్నంటే వుంటారని అన్నారు.

ఇద్దరు మంత్రులు, ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే కీలకమైన సమీక్షా సమావేశంకు ఇద్దరు మంత్రులు, ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా, దక్షిణ విశాఖ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.

అద్దంకి నియోజకవర్గ నేతల నిరసన

ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జిని మార్చాలని ఆ నియోజకవర్గం నుంచి వచ్చిన వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సిఎం క్యాంపు కార్యాలయం సమీపంలోని క్రిస్టియన్ పేటలో వారు ఆందోళన చేశారు. అద్దంకి వైసిపి ఇన్‌ఛార్జి బి కృష్ణ చైతన్యను మార్చాలని డిమాండ్ చేశారు. కృష్ణ చైతన్యను మార్చకపోతే పార్టీ అభ్యర్థికి సహకరించేది లేదన్నారు.

సామాజిక న్యాయాన్ని బిజెపి ఖూనీ చేస్తోంది

అందరూ ఐక్యంగా ఎదుర్కోవాలి

- జాతీయ సదస్సులో స్టాలిన్
- ఏచూరి, ఫరూక్ అబ్దుల్లా, అఖిలేష్‌తో సహా 20 రాజకీయ పార్టీల నేతలు, ఇతర ప్రముఖులు హాజరు



సదస్సునుద్దేశించి మాట్లాడుతున్న స్టాలిన్, సీతారామ్ ఏచూరి, వీరప్పమొయిలీ, హేమంత్ సోరెన్, అశోక్‌గెహ్లాట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక న్యాయాన్ని బిజెపి ఖూనీ చేస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో సోమవారం నాడిక్కడ జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేసిందని అన్నారు. ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన ఈ సదస్సులో కొంత మంది భౌతికంగా, మరికొందరు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. "సామాజిక న్యాయ కోసం జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లటం, సామాజిక న్యాయం సాధనకు జాతీయ సంయుక్త కార్యక్రమం" అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ సదస్సులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ సదస్సులో మొత్తం 20 రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులు, సీనియర్ పాత్రికేయులు ప్రసంగించారు. వీరిలో ఎంపి పి. విల్సన్ (డిఎంకె), డెరెక్ ఓబ్రెయిన్ (టిఎంసి), ఛగన్ భుజ్‌బాల్ (ఎన్‌సిపి), ఈటి. మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), సంజయ్ సింగ్ (ఆప్), రాజ్‌కుమార్ సైనీ (ఎల్‌ఎస్‌పి), మహాదేవ్ జంకర్ (ఆర్‌ఎస్‌పి), వీరప్ప మొయిలీ (కాంగ్రెస్),

మిగతా 5లో



రాహుల్‌కు బెయిల్

అప్పీలుపై 13న విచారణ

సూరత్ సెషన్స్ కోర్టు ఆదేశం

సూరత్ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ (52)కి ఊరట లభించింది. సూరత్ సిటీలోని సెషన్స్ కోర్టు ఆయనకు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. పరువునష్టం క్రిమినల్ కేసులో శిక్ష అమలుపై స్టే ఇవ్వాలని, దిగువ కోర్టు తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును సస్పెండ్ చేయాలని కోరుతూ రాహుల్ తరపు న్యాయవాదులు కీర్తి పన్వాలా, తారుణల్ చీమా దాఖలు చేసిన అప్పీలుపై ఈ నెల 13న కేసు విచారణ చేపట్టాలని అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఆర్.పి.మోగెరా నిర్ణయించారు. బెయిలు మంజూరు చేయడంపై రాహుల్ హర్షం వ్యక్తం చేస్తూ, సత్యమే తన ఆయుధం అని వ్యాఖ్యానించారు. 2019 ఎన్నికల ర్యాలీలో మోడీ ఇంటిపేరును కించపరిచేలా రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ సూరత్ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పూర్ణేష్ మోడీ దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేతకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గత నెల 23న సూరత్‌లోని మెజిస్ట్రేట్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ నిరంకుశపోకడలకు, రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇదొక నిదర్శనమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాహుల్ గాంధీని దోషిగా పేర్కొన్న దిగువ కోర్టు తన తీర్పుపై అప్పీలు చేసుకునేందుకు 30 రోజుల వరకు గడువు ఇచ్చింది. దీంతో ఈ కేసులో తనకు విధించిన రెండేళ్ల శిక్షను నిలుపు చేయాలని, శిక్ష అమలుపై స్టే విధించాలని కోరుతూ రాహుల్ రెండు పిటిషన్లు పెట్టుకున్నారు. ఎదుటిపక్షం వాదనలు వినకుండా ఆదేశాలు జారీ చేయలేమంటూ ఈ అప్పీలుపై 13న విచారణ చేపడతామని సెషన్స్ న్యాయమూర్తి చెప్పారు. విచారణ పూర్తయ్యేవరకు ఈ బెయిల్ అమల్లో వుంటుందని అన్నారు. ఫిర్యాదీదారు పూర్ణేష్ మోడీకి కూడా కోర్టు నోటీసులు జారీ చేసింది. 10వ తేదీలోగా తన సమాధానాన్ని తెలియచేయాల్సిందిగా పూర్ణేష్ మోడీని కోరింది. ఈ కేసు విచారణ సందర్భంగా రాహుల్ గాంధీ కోర్టుకు హాజరు కాకుండా మినహాయింపు ఇచ్చింది.

సోమవారం ఉదయం భారీ బందోబస్తు నడుమ లగ్జరీ బస్సులో రాహుల్ గాంధీ, తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి కోర్టుకు వచ్చారు. 'ప్రజాస్వామ్యం కాపాడాలి' అంటూ కోర్టు వెలుపల కాంగ్రెస్ కార్యకర్తలు బ్యానర్లు ప్రదర్శించారు. 2019లో కర్ణాటకలో ఎన్నికల ప్రచారం సందర్భంగా మోడీ ఇంటి పేరు కలిగిన నీరవ్ మోడీ (ఇండియన్ డైమండ్ మర్చంట్), క్రికెట్ బోర్డు నుంచి జీవిత కాల నిషేధాన్ని ఎదుర్కొంటున్న లలిత్ మోడీ (ఐపిఎల్ మాజీ చీఫ్), నరేంద్రమోడీ అంతా దొంగలేనన్న వ్యాఖ్యలపై గుజరాత్ బిజెపి ఎమ్మెల్యే క్రిమినల్ పరువు నష్టం కేసు వేశారు. రాహుల్ వ్యాఖ్యలు యావత్ కమ్యూనిటీని అవమానించడమేనని ఆయన వాదించారు.

వామపక్ష ప్రభుత్వాల హయాంలో

3 రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ చట్టం

- కేంద్రం ఆ పథకాలు అమలు చేయదు.. నిధులు ఇవ్వబోదు
- రాజ్యసభలో కేంద్ర మంత్రి కౌశల్ కిశోర్

లోపలి పేజీలో..




టెన్త్ విద్యార్థులకు తొలిరోజే అవస్థలు

- తెలంగాణలో పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాల్లో ప్రశ్నపత్రం బయటకు
- ఎపిలో రెండు జిల్లాల్లో ప్రశ్నపత్రాలు తారుమారు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 మంది అధికారులపై చర్యలు

లోపలి పేజీలో..

పేదలకు రాజధానిలో ఇళ్ల పట్టాలు

గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు సిఎం ఆదేశం



ప్రజాశక్తి-అమరావతి / అమరావతి బ్యూరో

కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన పేదలకు అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల పట్టాలివ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సిఎం జగన్ అధ్యక్షతన సోమవారం జరిగిన 33వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం మూడో విడత కింద 48,218 మందికి ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించాలని గుంటూరు, కృష్ణా జిల్లాల కలెక్టర్లను సిఎం ఆదేశించారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమర్రు ప్రాంతాల్లో ఈ స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులు వీడిన తర్వాత పేదలకు దక్కుతాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాతో డిపిఆర్‌లు తయారుచేయాలని చెప్పారు. ఈ ప్రతిపాదనలను సిఆర్‌డిఎకు అప్పగించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేలా తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. మే నెల మొదటివారం నాటికి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్లు లేని పేదల చిరకాల వాంఛ నెరవేర్చే ఈ కార్యక్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అమరావతిలో 1,134.58 ఎకరాల భూమిని ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించింది. మొత్తం 20 లే అవుట్లలో ఈ స్థలాలున్నాయి. ఇళ్ల పట్టాలిచ్చేందుకు సిఆర్‌డిఎ చట్టంలో మార్పులు చేసి సెక్షన్ 41(3), (4) ప్రకారం ఆర్-5 జోన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబరులో అభ్యంతరాలు, సలహాలను స్వీకరించింది. దీనిపై సిఆర్‌డిఎ బహిరంగ విచారణ జరిపింది. ఆర్-5 జోన్‌కు గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. సిఎం నిర్వహించిన ఈ సమావేశంలో పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, రవాణా, రోడ్లు, భవనాలశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, సిఆర్‌డిఎ కమిషనరు వివేక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టుకు..

సిఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జారీ చేసిన జిఓ 45ను సవాల్ చేస్తూ.. హైకోర్టులో అమరావతి రైతులు అత్యవసరంగా లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ సోమవారం విచారణ జరిపారు. ఇదే అంశానికి చెందిన కేసులో చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేస్తోందని, తాజా పిటిషన్‌ను కూడా అదే బెంచ్‌కు నివేదించాలని ప్రభుత్వం కోరింది. ఇందుకు అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రైతుల వినతి మేరకు తాజా పిటిషన్ మంగళవారం త్రిసభ్య ధర్మాసనం విచారణకు వచ్చే అంశంపై రిజిస్ట్రీ తగిన నిర్ణయం తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

మోడీ నిరంకుశ విధానాలతో ప్రమాదంలో దేశం

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ. బేబీ

ప్రశ్నించకపోతే ఎవరూ మిగలరు : రాఘవులు

బిజెపి విషయంలో వైసిపి, టిడిపి, జనసేన వైఖరి ఒకటే



సభలో మాట్లాడుతున్న ఎంఎ బేబీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ, ఫాసిస్టు తరహా విధానాలతో దేశం ప్రమాదంలో పడుతోందని దీన్ని ప్రశ్నించకపోతే భవిష్యత్‌లో రాజకీయాల్లో ఎవరినీ మిగలనీయరని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ అన్నారు. పెరుగుతున్న మోడీ నియంతృత్వం, ప్రజాస్వామ్యానికి ప్రమాదం అనే అంశంపై సిపిఎం ఆధ్వర్యాన విజయవాడ ఎంబివికెలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశ రాజకీయ వ్యవస్థను తన గుప్పెట్లో ఉంచుకునేందుకు మోడీ పూర్తి నిరంకుశ మితవాదంతో లౌకిక రాజ్యాంగ వ్యవస్థను దెబ్బతీస్తున్నారని తెలిపారు. ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ప్రతిపక్షాలను కొనుగోలు చేసి ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నారని, దీనికి కర్ణాటక, ఈశాన్య రాష్ట్రాల పరిస్థితులే ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టేందుకు ప్రతిపక్ష సభ్యులను కొనుగోలు చేశారని అన్నారు. అనేక భాషలు, మతాలు, ప్రాంతాలు, ఆచార వ్యవహారాలను దెబ్బతీస్తున్నారని, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఆహారం, ఆహార్యం అనే విధంగా ఆంక్షలు

మిగతా 2లో



జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

- ఐదుగురు మావోయిస్టులు మృతి

రాంచీ : జార్ఖండ్‌లో సోమవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం పలాము చత్రా సరిహద్దులో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో గౌతం పాసవాన్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులతో పాటు భారీగా ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన గౌతం పాసవాన్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. చనిపోయిన మరో ఇద్దరు మావోయిస్టులపై రూ.5 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. పలాము ఛత్రా సరిహద్దుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో సిఆర్‌పిఎఫ్ కోబ్రా యూనిట్‌తో కలిసి జాయింట్ టీమ్ ఆపరేషన్ ప్రారంభించామని అంతఘర్ అదనపు ఎస్‌పి కోమన్ సిన్హా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారన్నారు. కొయెలిబెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సుమన్ సింగ్ అంచల, సంజయ్ కుమార్ ఉసెండి, పరుశరాం ధంగల్‌లను అరెస్టు చేశామని తెలిపారు. వారిపై చాలా కేసులు ఉన్నాయని చెప్పారు.

చెట్టును ఢీకొన్న కారు



- ముగ్గురు రిప్రజెంటేటివ్‌లు మృతి

ప్రజాశక్తి- కొనకనమిట్ల (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు రిప్రజెంటేటివ్‌లు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన యూసుఫ్ (38), శ్రీనివాసులు (50) కాష్మోషిస్ కంపెనీలోనూ, బెజవాడ వెంకటేశ్వర్లు (53) ఆర్గానిక్ కంపెనీలోనూ రిప్రజెంటేటివ్‌లుగా పని చేస్తున్నాడు. వీరు ముగ్గురూ కలిసి కారులో గిద్దలూరు వచ్చారు. పనులు ముగించుకొని ఒంగోలుకు తిరుగు ప్రయాణమయ్యారు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఒంగోలు-నంద్యాల జాతీయ రహదారిపై వారి కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న తాటి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పొదిలి సిఐ రాఘవేంద్ర, ఎస్‌ఐ మల్లికార్జున పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పొదిలి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం ముంపుపై సర్వే

- కేంద్ర జలసంఘం

లోపలి పేజీలో..

లైంగిక వేధింపుల కేసులో

కళాక్షేత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్టు

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేనేత రంగాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేసి కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. 50 ఏళ్లలో ఎప్పుడూ లేనంతగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడిందని, కార్మికులకు ఉపాధి కరువై అల్లాడుతున్నారని పేర్కొన్నారు. మరమగ్గాల వైలేషన్ ఉత్పత్తులు పెరిగి పట్టుచీరల నిల్వలు ఎక్కడికక్కడ పేరుకుపోవడమే ఈ సంక్షోభానికి కారణమన్నారు. డిమాండ్‌కు మించి చేనేత ఉత్పత్తుల నిల్వలు పేరుకుపోయి మగ్గాలు మూత పడుతున్నాయని, మరమగ్గాల కార్మికులు కూడా ఉపాధి కోల్పోతున్నారని వివరించారు. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటుచేసి, ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలకు పెంచాలని కోరారు.

సొంత ఎమ్మెల్యేలను మోసం చేస్తున్న జగన్

- టిడిపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ అబద్ధాలతో ప్రజల్ని మోసం చేసినట్టు తన సొంత పార్టీ వైసిపి ఎమ్మెల్యేలను మోసం చేయాలని చూస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓట్లతోనే టిడిపి గెలిచిందన్న సిఎం వ్యాఖ్యలు హాస్యాస్పదమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ప్రకారం గెలిస్తే గెలుపు కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ గెలిచింది రెండో ప్రాధాన్యత ఓట్లతో కాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో వైసిపి భవిష్యత్తు ఏమిటో జగన్ సహా ఆ పార్టీ నేతలకు అర్థమైందని తెలిపారు. దీనిని కప్పిపుచ్చుకునే యత్నం చేస్తున్నారన్నారు.

డ్రగ్స్ రవాణాపై అప్రమత్తం

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి బస్సుల్లో, కార్గోలో డ్రగ్స్ అక్రమ రవాణా పట్ల సిబ్బంది అప్రమత్తంగా వుండాలని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు హెచ్చరించారు. ఇటీవల ఆర్‌టిసి బస్‌లలో, కార్గోలలో డ్రగ్స్ రవాణా జరుగుతున్నట్లు వార్తలు రావడంతో ఆయన సోమవారం ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతోపాటు అన్ని జిల్లాల ఆర్‌టిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్‌టిసి బస్సుల్లో ఎలాంటి మత్తు పదార్థాలనైనా రవాణా చేయడం నేరమన్నారు. కార్గో బుకింగ్‌ల వద్ద అప్రమత్తంగా వుండాలన్నారు. బుకింగ్ చేసేటప్పుడు ఆధార్, పూర్తిస్థాయి అడ్రస్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమానాస్పదంగా వుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ కోటేశ్వరరావు, కెఎస్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పూర్తికి చొరవ తీసుకోండి

- కేంద్ర మంత్రికి పవన్‌కల్యాణ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో వైసిపి ప్రభుత్వం తీవ్ర కాలయాపన చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కేంద్ర ప్రభుత్వానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి పోలవరం బహుళార్థక ప్రయోజనాలు అందిస్తుందని, ఇంతటి ముఖ్యమైన ప్రాజెక్టు విషయంలో నిధుల కొరత పేరుతో వైసిపి ప్రభుత్వం జాప్యం చేయడంతో నిర్మాణ పురోగతి దెబ్బ తింటోందని షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. 2019 మే నాటికి పోలవరం పనులు 72 శాతానికి పైగా పూర్తయితే, గత నాలుగేళ్లలో మూడు శాతం పనులు కూడా పూర్తి కాలేదనే విషయాన్ని ప్రస్తావించారు. విశాఖ పారిశ్రామిక జోన్‌కు అవసరమైన నీరు, విశాఖ మెట్రో నగరానికి తాగునీటి అవసరాలు తీర్చే పోలవరం ఎడమ కాలువ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్లకపోవడంపై వైసిపి ప్రభుత్వం కేంద్రంపై నిందలు వేస్తోందని షెకావత్ పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఆర్‌అండ్‌ఆర్ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఏ విధమైన శ్రద్ధ చూపడం లేదన్నారు.

అంతకముందు ఏపి బిజెపి ఇన్‌ఛార్జి మురళీధరన్‌తో గంటన్నరపాటు పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, జనసేన, బిజెపి ఉమ్మడి కార్యాచరణతోపాటు వైసిపి విపక్షాలపై అనుసరిస్తున్న కఠిన వైఖరి, భౌతికదాడులు, ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించిన విపక్ష పార్టీల కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులు పెడుతున్న వైనం గురించి మురళీధరన్‌కు వివరించినట్లు సమాచారం. మంగళవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కలిసే అవకాశముంది.

టెన్త్ విద్యార్థులకు తొలిరోజే అవస్థలు

- తెలంగాణలో పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాల్లో ప్రశ్నపత్రం బయటకు
- ఏపిలో రెండు జిల్లాల్లో ప్రశ్నప్రత్నాలు తారుమారు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 మందిపై చర్యలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రెండు తెలుగు రాష్ట్రాల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు అవస్థలు తప్పలేదు. తెలంగాణలో పరీక్ష మొదలైన ఏడు నిమిషాల్లోనే ప్రశ్నపత్రం బయటకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రశ్నపత్రాలు తారుమారు అయ్యాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో నలుగురిపైనా, ఏపిలో ఎనిమిదిమందిపైనా అధికారులు చర్యలు తీసుకున్నారు. తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి తండ్రి చనిపోయిన దు్ఖంతోనూ పరీక్షకు హాజరయ్యారు. ఏపిలో ఆరుగురు అంధ విద్యార్థులు ల్యాప్‌ట్యాప్ సహాయంతో స్వయంగా పరీక్ష రాశారు. అనంతపురంలో జిల్లా పరీక్షా కేంద్రాన్ని చూడడానికి వెళ్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురంలో ఒక వికలాంగ విద్యార్థి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జిల్లాలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఒక విద్యార్థిని సహాయకుల సహకారంతో పరీక్ష రాశారు. ఏపిలో 6,17,971 మంది విద్యార్థులకుగాను తొలిరోజు 6,11,832 (99.01 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. 6,063 మంది హాజరు కాలేదు. మొత్తం 3,349 పరీక్ష కేంద్రాలను ఎస్ఎస్‌సి బోర్డు ఏర్పాటు చేసింది. తెలంగాణలో పదో తరగతి పరీక్షకు తొలిరోజు 4,85,954 మందికి గాను 4,84,019 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1935 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

అమ్మతోడుగా పరీక్షా కేంద్రానికి

వికలాంగుడైన అనంతపురం జిల్లా పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన భరత్ కుమార్‌రెడ్డిని ఆమె తల్లి ఎత్తుకొని పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చి పది పరీక్ష రాయించారు. కడవకల్లు గ్రామం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రంలోకి ఆమె తన చేతుల మీదుగా మోసుకొని వచ్చారు. వికలాంగుడైన ఆ విద్యార్థి పరీక్ష రాసేందుకు అధికారులు తొమ్మిదో తరగతి విద్యార్థినిని సహాయకురాలిగా ఇచ్చారు.



వికలాంగుడైన తన కుమారుడిని చేతులపై మోసుకొచ్చి అనంతపురం జిల్లా విడుపనకల్లు మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో కూర్చోబెడుతున్న తల్లి



హిందీలో వచ్చిన ప్రశ్నాపత్రాన్ని చూపుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాల రాజవొమ్మంగికి చెందిన నూకరత్నం

పరీక్షా కేంద్రాన్ని చూడడానికి వెళ్తూ ప్రమాదానికిలోనై విద్యార్థి మృతి

పదో పరీక్షా కేంద్రాన్ని చూడడానికి వెళ్తుండగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం హావలిగి గ్రామానికి చెందిన కె.వంశీ (17), జి.మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డారు. వీరు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉంది. వీరికి కేటాయించిన విడపనకల్లు మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరిని కారును ఢీకొంది. బెంగళూరులో చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాడు.

పరీక్షలకు హాజరైన హృద్రోగ విద్యార్థిని

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న పదో తరగతి విద్యార్థిని తిరుకోటి దివ్య... డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కాట్రేనికోన హైస్కూలులో సహాయకురాలి సహకారంతో పరీక్ష రాసింది. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు కృషితో తొమ్మిది తరగతి విద్యార్థిని సహకారంతో పరీక్ష రాసేందుకు ఆమెకు అధికారులు అనుమతి ఇచ్చారు.

గాయాలతోనే పరీక్షకు హాజరు

గత నెల 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఖేష్ అధికారుల అనుమతితో తొమ్మిదో తరగతి విద్యార్థి సాయంతో పదో తరగతి పరీక్ష రాశాడు. హిందూపురం పట్టణంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన ఆ విద్యార్థి తల, చేతులకు తీవ్రంగా గాయాలవ్వడంతో బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. పరీక్ష రాసేందుకు అక్కడి నుంచి తల్లిదండ్రుల సాయంతో వచ్చాడు. దొర్నిపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థికి అనుకోకుండా కడుపు నొప్పి వచ్చింది. దీంతో, ఆయనను అధికారులు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

'అనంతపురం, అల్లూరి సీతారామరాజు జిలాల్లో మారిన ప్రశ్నపత్రం ఎనిమిది మంది ఇన్విజిలేటర్లు సస్పెన్షన్

అనంతపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రశ్నపత్రాలు తారుమారయ్యాయి. అనంతపురం నగరంలోని భాష్యం పాఠశాలలో పరీక్ష రాసిన నందిని, సివిఆర్ పాఠశాలలో జశ్వంత్‌లకు ఫస్ట్ లాంగ్వేజ్ వంద మార్కుల ప్రశ్నపత్రం ఇవ్వాల్సి ఉండగా, 75 మార్కుల కంపోజిట్ ప్రశ్నపత్రాన్ని ఇన్విజిలేటర్లు ఇచ్చారు. పరీక్ష అనంతరం ఈ విషయాన్ని గ్రహించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో, ఇన్విజిలేటరైన నాగవేణి, నాగభూషణంను అధికారులు సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారులతో విద్యార్థులకు మాట్లాడి న్యాయం చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ హామీ ఇచ్చారు. అనంతపురంలోని శ్రీ పొట్టి శ్రీరాములు, నేతాజీ పాఠశాల్లో అధికారులు జరిపిన తనిఖీలు జరిపి లోపాలను గుర్తించి ఆరుగురు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రాజవొమ్మంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న నాగులాపల్లి అంజిబాబుకు తెలుగు బదులు ఉర్దూ ప్రశ్నపత్రం, స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో పరీక్ష రాస్తున్న మజ్జి నూకరత్నంకు తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం వచ్చాయి. దీనిపై ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా నూకరత్నంకు 25 రోజుల క్రితమే హాల్ టికెట్‌లో హిందీ వచ్చినట్లు ఉందని తెలిపారు. హెడ్‌మాస్టర్ చూసుకోవాల్సి ఉన్నా ఆ పని జరగలేదన్నారు. అంజిబాబుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు తెలుగు పేపర్ ఇచ్చి పరీక్ష రాయించామని చెప్పారు.

ఎవరి సహాయం లేకుండా పరీక్ష రాసిన అంధ విద్యార్థులు

అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు అంధ విద్యార్థులు ఎవరి సహకారం లేకుండా వారి ల్యాప్ ట్యాప్‌ల ద్వారా వారే స్వయంగా తెలుగు పరీక్షలో పరీక్ష రాశారు. అంధ విద్యార్థులు ఇలా పరీక్షలు రాయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. వీరంతా ఆర్‌డిటి ఇన్‌క్లీజివ్ పాఠశాలల్లో చదువుతున్నారు.

వైఎస్ఆర్ జిల్లాలో ప్రశ్నపత్రం లీకైనట్లు ప్రచారం

వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో పదో తరగతి తొలి పరీక్ష తెలుగు ప్రశ్నపత్రం లీకేజీనట్లు ప్రచారం జరిగింది. దీనిపై అన్నమయ్య, కడప జిల్లాల పరీక్ష పరిశీలన అధికారి వెంకట కృష్ణారెడ్డి స్పందిస్తూ, ఈ ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. ప్రశ్నపత్రంలోని కొన్ని సమాధానాలు మాత్రం జిరాక్స్ సెంటర్ వద్ద లభ్యమయ్యాయని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, జిరాక్స్ సెంటర్ యాజమానిని, ఆన్సర్ సీటు తెచ్చిన వ్యక్తిని విచారణ చేస్తున్నామని చెప్పారు.

పరీక్ష మొదలైన ఏడు నిమిషాల్లోనే వాట్సాప్‌లో ప్రశ్నపత్రం తెలంగాణలో నలుగురు ఉద్యోగులపై వేటు

పదో తరగతి తెలుగు పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాల్లోనే ప్రశ్నపత్రం బయటకు రావడం కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూర్‌లోని ఒకటవ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభంకాగా..9.37 నిమిషాలకు క్వచన్ పేపర్ వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైంది. స్థానిక ఎంఇఒ ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న బయోసైన్స్ ఉపాధ్యాయుడు బందప్ప, ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారని నిర్ధారించారు. చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కె.గోపాల్, ఇన్విజిలేటర్లు బందెప్ప, సమ్మప్పలను వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సస్పెండ్ చేశారు. ఇన్విజిలేటర్ బందెప్ప చేసింది మాల్ ప్రాక్టీస్ కిందకే వస్తుందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగలేదని, మంగళవారం పరీక్ష యథాతథంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఇంట్లో తండ్రి మృతదేహం - పుట్టెడు దు:ఖంతో టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థి

తండ్రి మృతదేహం ఇంట్లో ఉండగానే.. పుట్టెడు దు:ఖంతో ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన తక్కళ్ల వెంకటి (38) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన కొడుకు తక్కళ్ల రోహిత్ పదో తరగతి పరీక్ష రాయాల్సి ఉంది. దు్ఖాన్ని దిగమింగు కుని.. గుండె నిండా బాధతోనే రోహిత్ పరీక్షకు హాజరయ్యాడు. పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.

2 వారాల్లో బదిలీలపై స్పష్టత

- 3 రోజులు సెలవిచ్చే అధికారం వార్డు అడ్మిన్‌కు కల్పించాలి
- అజయ్‌జైన్‌కు ఎంప్లాయిస్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ అంశంపై రెండు వారాల్లో స్పష్టత ఇస్తామని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ తమతో చెప్పినట్లు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి జానిపాషా పేర్కొన్నారు. విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఫెడరేషన్ ఆధ్వర్యాన ప్రతినిధుల బృందం అజయ్‌జైన్‌ను కలిసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లకు సంబంధించి వినతిపత్రం సమర్పించారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించే అంశంలో సానుకూలంగా స్పందించినట్లు జానిపాషా తెలిపారు. రెండో దశలో రిక్రూట్ అయిన ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ త్వరలో చేపడతామని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అవసరమైన క్యాజువల్ లీవ్స్ మూడు రోజుల వరకు ఇచ్చే అధికారం గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు, వార్డు సచివాలయాల్లో వార్డు అడ్మిన్ సెక్రటరీలకు అధికారాలు కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కె సుభాని, రహీం, శ్వేత, ఎల్ అర్చన, బి నిరోషా, మెహబూబ్ పాల్గొన్నారు.

రామోజీరావును విచారించిన సిఐడి

- 6న విచారణకు రావాలని శైలజా కిరణ్‌కు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిట్‌ఫండ్స్ చట్టానికి వ్యతిరేకంగా మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ వ్యాపార లావాదేవీలు నిర్వహించిందన్న కేసులో నిందితుడుగా ఉన్న చెరుకూరి రామోజీరావును ఆంధ్రప్రదేశ్ సిఐడి పోలీసులు విచారించారు. సోమవారం ఉదయం 11.30గంటల సమయంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రామోజీరావు కోడలు శైలజా కిరణ్ నివాసానికి వచ్చిన సిఐడి ఎస్‌పి అమిత్ బర్దార్ నేతృత్వంలోని బృందం..సాయంత్రం 7గంటల వరకు రామోజీరావును విచారించింది. ఆయన స్టేట్‌మెంట్‌ను వీడియో రికార్డు చేశారు.

విచారణ ముగిసిన తర్వాత సిఐడి ఎస్‌పి మాట్లాడుతూ.. మార్గదర్శిపై ఇప్పటివరకు ఏడు కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. తన కోడలు శైలజా కిరణ్ ఇంటికి వచ్చి విచారించాలని రామోజీరావు కోరిన మీదటే ఇక్కడకి వచ్చామని తెలిపారు. అవసరం అనుకుంటే రామోజీరావును మళ్లీ విచారిస్తామని చెప్పారు. ఇదే కేసుకు సంబంధించి ఈనెల ఆరున విచారణకు హాజరుకావాలని రామోజీరావు కోడలు శైలజాకిరణ్‌కు సిఐడి పోలీసులు నోటీసులు అందజేశారు.

మోడీ నిరంకుశ విధానాలతో ప్రమాదంలో దేశం

మొదటిపేజీ తరువాయి

పెడుతున్నారని మండిపడ్డారు. ప్రశించిన ప్రతిపక్షాలపై పూర్తిస్థాయిలో నిర్బంధం ప్రయోగిస్తున్నారని అన్నారు. కర్నాకటలో విమర్శ చేసిన రాహుల్‌పై గుజరాత్‌లో పరువునష్టం కేసువేసి రెండు సంవత్సరాల శిక్ష వేయించి అప్పటికప్పుడు అతని పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయించారని తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం కూడా అక్కడ న్యాయవ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసిన విషయం ఇందులో స్పష్టమవుతోందని తెలిపారు. రాహుల్‌ను పార్లమెంటు నుండి బహిష్కరించిన వ్యవహారం మొత్తం ఒక సినిమా స్క్రీన్‌ప్లే మాదిరి ఉందని, కోర్టు తీర్పు ఇవ్వడం, వెంటనే పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దుచేయడం, క్వార్టర్ నుండి పంపించేయడం అన్నీ చకచకా జరిగిపోయాయని తెలిపారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పష్టమైన వైఖరిలేని కాంగ్రెస్

కాంగ్రెస్ కూడా అనేక రాష్ట్రాల్లో బిజెపి విషయంలో స్పష్టమైన వైఖరితో వ్యవహరించడం లేదని అన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు బిజెపితో కలిసి పనిచేస్తోందని అన్నారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను అరెస్టు చేసిన సమయంలో స్వాగతించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. ఇప్పుడు పార్లమెంటులో వాళ్ల నాయకుడిపైనే చర్యలు తీసుకున్నారని అన్నారు. స్పష్టమైన వైఖరి లేకుండా ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్‌లో కాంగ్రెస్ తరుపున మిగిలేవారెవరూ ఉండరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.

అదానీ అవినీతి వ్యవహారంపై ప్రశ్నించిన వారిపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపులకు దిగుతోందని, పార్లమెంటు నుండి బహిష్కరిస్తోందని ఎం.ఎ.బేబీ విమర్శించారు. 2017లో 7.1 మిలియన్ డాలర్లుగా ఉన్న అదానీ ఆస్తి 2022 నాటికి 200 మిలియన్ డాలర్లకు చేరిందని, దీనివెనుక మోడీ క్రోనీ క్యాపిటలిజం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఆస్తులన్నీ అదానీకి అప్పగిస్తున్నారని దీనిపై ప్రశ్నిస్తే సిబిఐ, ఈడి వంటి సంస్థలతో దాడులు చేయిస్తున్నారని అన్నారు.

ఇప్పుడు ప్రశ్నించకపోతే ఎవరూ మిగలరు : బి.వి.రాఘవులు

మోడీ, బిజెపి అవినీతి వ్యవహారాలను ప్రశ్నించకపోతే చివరకు మన వరకూ వస్తారని, అప్పుడు అడిగేందుకు ఏమీ ఉండదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన ఎవరూ కూడా బిజెపిని ప్రశ్నించడం లేదని అన్నారు. పైగా వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న వనరులను అదానీ చేతిలో పెడుతోందని అన్నారు. గంగవరం పోర్టులో రాష్ట్ర వాటానూ తాంబూలం ఇచ్చినట్లు ఇచ్చేశారని విమర్శించారు. పోలవరం నిధుల విషయంలో డిమాండ్‌చేసి అడగాల్సిందిపోయి కేంద్రం వద్ద అడుక్కునే పద్ధతిలో వ్యవహరిస్తున్నారని ఇది సరైంది కాదని పేర్కొన్నారు. అలాగే ప్రతిపక్షాలపై దాడులనూ జగన్, టిడిపి, జనసేన ప్రశ్నించలేదని, బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇది రాష్ట్రానికి ప్రమాదకరమని తెలిపారు.

ఇదే పద్ధతిలో వ్యవహరిస్తే భవిష్యత్‌లో ప్రశ్నించేందుకు ఎవరూ మిగలరని, రాష్ట్రం అగాథంలోకి వెళ్లిపోతుందని తెలిపారు. అలాగే అప్పుల కోసం జగన్ విద్యుత్ మీటర్లు పెడుతున్నారని, బిజెపి పాలిత రాష్ట్రాలో తిరస్కరించినవాటిని ఇక్కడ అమలు చేస్తున్నారని, ఇంతకంటే లొంగుబాటు మరొకటి ఉండదని తెలిపారు. ఉత్పత్తిరంగం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. ఇది లేకపోతే యువత అన్యాయమైపోతుందని పేర్కొన్నారు.

ఫెడరలిజాన్ని దెబ్బతీస్తున్నారని, వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని, మత ఘర్షణలు రేపుతున్నారని తెలిపారు. బీహార్, హౌరాలో ఘర్షణలు ఇందులో భాగమేనని అన్నారు. ఈ చర్యలను ఇప్పుడు అడ్డుకోకపోతే 2024 ఎన్నికల తరువాత గుణాత్మకమార్పు వస్తుందని, అప్పుడు బిజెపి మరింత ప్రమాదకరంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిపిఎం, సిపిఐ ప్రచార కార్యక్రమం చేపడుతున్నాయని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కూడా మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో వక్తలను బి.రమణ వేదిక మీదకు ఆహ్వానించారు. నాయకులు డి.వి.కృష్ణ, శ్రీదేవి, సత్యబాబు, కృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో వివక్ష తగదు

- అందరికీ అవకాశం కల్పించాలని ఆర్‌టిసి హౌస్ ముట్టడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసిలో అర్హత కలిగిన వారందరికీ కారుణ్య నియామకాలు చేపట్టాలని బాధిత కుటుంబాలు నిరసన వ్యక్తం చేశాయి. 2016 తర్వాత మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు మాత్రమే కారుణ్య నియామకాలను చేపడుతూ ఆర్‌టిసి యజమాన్యం ఇటీవల ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. 2016కు ముందు వెయిటింగ్‌లో వున్న 250 కుటుంబాలకు సంబంధించిన కారుణ్య నియామకాలను చేపట్టాల్సిందేనని సోమవారం ఆర్‌టిసి హౌస్ ఎదుట బాధిత కుటుంబాలు పెట్రోల్ బాటిళ్లతో నిరసన చేపట్టారు. రాజమండ్రికి చెందిన రవికుమార్ ఉద్యోగం రాదని మనోవేదనతో గుండెపోటుతో మృతి చెందారని అన్నారు. తమకు న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని బాధితులు హెచ్చరించారు. తక్షణమే అందరికీ కారుణ్య నియామకాలు చేపట్టి, తమను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జిఓ 24పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా ఉచిత సీట్లు పొందే విద్యార్థుల ఫీజులకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జిఓ 24ను సవాల్ చేసిన కేసులో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఆ విధంగా సీట్లు పొందే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఇచ్చే మొత్తం నుంచి ఫీజులు చెల్లించాలన్న జిఓ 24ను పలు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు హైకోర్టులో సవాల్ చేశాయి. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.



సమావేశంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఆందోళనలు ఉధృతం

- 15న పాదయాత్ర, 25న ఉక్కు అధికారుల బంగ్లాల ముట్టడి
- కార్యాచరణ వెల్లడించిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు తెలిపారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి మంత్రులను కలిసి వచ్చిన సందర్భంగా పోరాట కమిటీ కార్యాచరణపై సోమవారం పోరాట కమిటీ ముఖ్య నేతలంతా ఉక్కునగరంలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో సమావేశమయ్యారు. సమీక్ష జరిపి ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల పదిన భారత రాష్ట్ర సమితి ఎపి అధ్యక్షులు తోట చంద్రశేఖర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేయనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 15న పెదగంట్యాడ నుంచి ఒక బృందం, కూర్మన్నపాలెం నుంచి మరో బృందం బయలుదేరి గాజువాక జంక్షన్ వద్ద రెండూ బృందాలు కలిసి సింహాచలం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. 25వ తేదీన సెక్టార్-7లో స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి, ఇతర డైరెక్టర్ల బంగ్లాలను ముట్టడించనున్నట్టు తెలిపారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోరాటాల్లో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్లు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కో-కన్వీనర్ జె అయోధ్యరాం, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, వైఎస్ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప, టిఎన్‌టియుసి నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, పోరాట కమిటీ నేతలు బి అప్పారావు, కెఎస్ఎన్ రావు, జె రామకృష్ణ, పుల్లారావు, కెవి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పథకాల రద్దుపై
శ్వేతపత్రం విడుదల చేయాలి

- సిఎం జగన్‌కు కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో అత్యధికశాతం వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని, ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆయా పథకాలకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. సబ్‌ప్లాన్‌కు సంబంధించిన రూ.వేలకోట్లు నిధులు దారిమళ్లించారని, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లకు బ్యాంకు రుణాలు, భూమి కొనుగోలు పథకం, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, కులాంతర వివాహాల ప్రోత్సాహం, నేషనల్ షెడ్యూల్డ్ కులాల ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి) ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, అంబేద్కర్ విదేశీ విద్యా పథకం, ఉద్యోగుల స్టడీ లీవ్ పూర్వ స్థితి, బుక్ బ్యాంక్ పథకం, 34 లక్షల ఇంటి స్థలాలు ఇచ్చే క్రమంలో 11 వేల ఎకరాల దళిత, గిరిజనులకు సంబంధించిన అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్న అంశాలకు సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వీటితోపాటు ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన (పిఎంజి) నిధులు దారిమళ్లింపు, స్టాండప్ ఇండియా ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాలు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన ద్వారా కన్వీనరు కోటా మినహాయించి మిగతా ఏ కోటాలో చేరినా ఉపకార వేతనాలు ఉండకుండా జిఓ నెంబరు 77 ఇవ్వడంపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడం, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు, ఎస్‌సి, ఎస్‌టి కారుణ్య నియామకాలు భర్తీ చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాల్యాద్రి డిమాండ్ చేశారు.

పోలవరం ముంపుపై సర్వే

- కేంద్ర జలసంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుతో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో తక్షణమే సర్వే చేపట్టాలని కేంద్ర జలసంఘం ఆదేశించింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీకి, ఆంధ్రప్రదేశ్‌కు ఆదేశాలు జారీ చేసింది. పోలవరం ముంపుపై సోమవారం కేంద్ర జలసంఘం సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు పోలవరం ముంపునకు గురయ్యే తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల అధికారులతో కేంద్ర జలసంఘం చైర్మన్ కుష్వీందర్ ఓరా వర్చువల్ సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏకాభిప్రాయ సాధన కోసం ఇప్పటికే రెండు పర్యాయాలు సమావేశం ఏర్పాటు చేసిన కేంద్ర జలసంఘం సోమవారం తాజాగా మళ్లీ సమావేశమైంది. ఈ సమావేశంలో ముంపు, సర్వే ఆవశ్యకతపై సుదీర్ఘంగా చర్చించారు. పోలవరం ముంపుపై మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలని తెలంగాణ పట్టుబట్టింది. 2022 వరదల నేపథ్యంలో జరిగిన ముంపుపై ఈ సర్వేలో తేల్చాలని కోరింది. కిన్నెరసాని, ముర్రేడువాగు నీటి లభ్యతపై కూడా సర్వే చేయాలని కోరింది. రానున్న వర్షాకాలంలో సర్వేకు అంతరాయం కలగకుండా ఏదైనా ఏజెన్సీతో పిపిఎ పర్యవేక్షణతో సర్వే వేగంగా చేయించాలని ఛత్తీస్‌గఢ్ కోరింది. ఈ సర్వేను వేగవంతం చేసేందుకు ఈ నెల 10న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని పిపిఎను కేంద్ర జలసంఘం ఆదేశించింది. గతంలో గోపాలకృష్ణ కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా తెలంగాణ, ఒడిశా అభ్యంతరం తెలిపాయి. ఈ సమావేశంలో ఎపికి చెందిన ఇఎన్‌సి నారాయణరెడ్డి, పోలవరం సిఇ సుధాకర్‌బాబు, తెలంగాణ నుంచి ఇఎన్‌సి నాగేంద్రరావు, సిఎంఒఎస్‌డి శ్రీధర్‌రావు, ఒడిశా ఇఎన్‌సి అశుతోష్‌దాస్, ఛత్తీస్‌గఢ్ ఇఎన్‌సి నగరియా తదితరులు మాట్లాడారు.

డ్వాక్రాకు టోకరా

- బ్రోచరు విడుదల చేసిన టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్వాక్రాను సిఎం వైఎస్ జగన్ నిర్వీర్యం చేస్తున్నారని టిడిపి నేతలు విమర్శించారు. 'ఆసరా కాదు డ్వాక్రాకు-డ్వాక్రా అభివృద్ధి చంద్రన్నతోనే' అనే బ్రోచరును సోమవారం విడుదల చేశారు. తెలుగునాడు అంగన్‌వాడీ-డ్వాక్రా సాధికార సంస్థ సమావేశం టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే రాష్ట్రంలో జగన్ అరాచక పాలన అంతమవుతుందన్నారు. సంక్షేమం మాటున జగన్ ప్రజాధనం లూటీ చేస్తున్నారని విమర్శించారు. లూటీపై క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యం చేయాలని టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, హెచ్‌ఆర్‌డి ఛైర్మన్ రామాంజనేయులు పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి జగన్ ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగునాడు అంగన్‌వాడీ-డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షులు ఆచంట సునీత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల్లి వెతుక్కునే దుస్థితిలో వైసిపి : బోండా ఉమా

జగన్ నాలుగేళ్ల అవినీతి, అసమర్థపాలన వల్ల రానున్న ఎన్నికల బరిలో నిలపడానికి అభ్యర్థుల్ని వెతుక్కునే దుస్థితికి వైసిపి వచ్చిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఎమ్మెల్యేలను పోటీ చేయాలని బతిమాలుకునే పనిలో వైసిపి నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి తరపున బరిలో నిలిచే 175 మంది అభ్యర్థుల పేర్లు తక్షణమే ప్రకటించే దమ్ము, ధైర్యం జగన్‌కు ఉందా? అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి సింగిల్ డిజిట్‌కే పరిమితం కానుందని ఐప్యాక్ సంస్థ సర్వేనే తేల్చిందని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన కుంటుపడిందని, ప్రతిపక్షాలపై కక్ష తీర్చుకునే పనిలో పాలనా యంత్రాంగం ముమ్మరంగా నిమగ్నమైందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి యంత్రాంగానికి పట్టడం లేదని ఆరోపించారు.

కిరణ్ నాడార్‌కు ఫ్రెంచి పౌర పురస్కారం



న్యూఢిల్లీ : వితరణ శీలి, కళా సేకరణకర్త కిరణ్ నాడార్‌కు ఇటీవల ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారాన్ని భారత్‌లో ఫ్రెంచ్ రాయబారి ఎమ్మాన్యుయెల్ లెనైన్ ప్రదానం చేశారు. కళా రంగంలో ఆమె చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా, జాతీయంగా, అంతర్జాతీయంగా సాంస్కృతిక రంగంలో అందరికీ అవకాశాలు కల్పించాలన్న ఆమె నిబద్ధతకు, భారత్, ఫ్రాన్స్ సాంస్కృతిక సంబంధాల పెంపులో నాయకత్వ పాత్ర పోషించినందుకు ఈ అత్యున్నత అవార్డును ప్రదానం చేశారు. కిరణ్ నాడార్ ఆర్ట్ మ్యూజియం ఛైర్‌పర్సన్‌గా వున్న ఆమె శివ నాడార్ ఫౌండేషన్ ట్రస్టీగా వున్నారు. రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను, కళా సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తుంది.

మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని సిబిఐ కోర్టు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందన్న సిబిఐ వాదనలతో ఏకీభవిస్తూ, కోర్టు కస్టడీని పొడిగించింది. మద్యం పాలసీ వ్యవహారంలో ఫిబ్రవరి 26న మనీష్ సిసోడియా సిబిఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

అమిత్‌షా మరో జుమ్లా

కపిల్ సిబాల్ విమర్శ

న్యూఢిల్లీ: బిజెపి పాలనలో మత ఘర్షణలు ఒక్కటి కూడా చోటుచేసు కోలేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనడం మరో జుమ్లా(అబద్ధం) అని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబాల్ విమర్శించారు. బిజెపి పాలిత కేంద్రంలోను, రాష్ట్రాల్లోను మత ఘర్షణలు లెక్కకు మిక్కిలి చోటుచేసుకున్నాయనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని సిబాల్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, తన ప్రతిష్టను దెబ్బ తీయడానికి కొందరు సుపారీ (కాంట్రాక్టు) తీసుకున్నారనడాన్ని సిబాల్ తీవ్రంగా ఆక్షేపించారు. ఆ సుపారీలెవరో పేర్లు బయటపెట్టండి, వారిని కచ్చితంగా ప్రాసిక్యూట్ చేద్దాం అని సిబాల్ ప్రధానిని సూటిగా అడిగారు.



విజయవాడ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నేతలు



కడప డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మెగా డిఎస్‌సి కోసం ధర్నా

- రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

25వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనలు చేపట్టారు. విజయవాడలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏటా ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా నేటికీ ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని అన్నారు. పది లక్షల మంది బిఇడి, టిటిసి విద్యను పూర్తి డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. తక్షణమే 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు.కడప డిఇఒ, కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శిరీష పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అంతకు ముందు సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులో గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం అక్కడే ధర్నా నిర్వహించారు. డిఆర్‌ఒకు వినతిపత్రం ఇచ్చారు. ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రకాశంలో జెసి ఎం.అభిషిక్త్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టర్ పి.ప్రశాంతికి వినతి పత్రం అందించారు.

5న మలివిడత ఉద్యమ కార్యాచరణ ప్రకటన

ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, ఉపాధ్యా యులు, పెన్షనర్ల సమస్యలపై మలివిడత ఉద్యమ కార్యాచరణను ఈ నెల ఐదో తేదీన ప్రకటిస్తామని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెల తొమ్మిద నుండి చేపట్టిన తొలివిడత ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం గుంటూరులోని పలు హెచ్‌ఒడి కార్యాలయాలను జెఎసి రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించారు. ఈ నేపథ్యంలో జడ్‌పి ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగులు దాచుకున్న డబ్బుల్లో కొంతమేర ఇటీవల చెల్లింపులు చేశారే తప్ప చట్టబద్ధంగా రావాల్సిన పిఆర్‌సి ఎరియర్లు, డిఎ ఎరియర్లు ఇవ్వలేదన్నారు. సుమారు రూ.పది వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిపై ప్రభుత్వం నోరెత్తడంలేదని తెలిపారు. 2022 నుండి కొత్త డిఎల ఊసే లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సిపిఎస్ రద్దు హామీలను 2022 నాటికి నెరవేరుస్తామన్న ఇంత వరకూ పూర్తి చేయలేదని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని విమర్శించారు. కొత్తగా ఏర్పడిన 13 జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ఎ ఇవ్వాలని, 12వ పిఆర్‌సికి సంబంధించి ఇప్పటి నుండే కమిషన్ ఏర్పాటు చేసి, చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దిగి రాకుంటే రాబోయే కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశమై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెఎసి సెక్రెటరీ జనరల్ పి దామోదర్, జిల్లా ఛైర్మన్ కె సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌సిఎల్'లో కార్మికుడు మృతి

రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి- అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా)


రోడ్డుపై ఆందోళన చేస్తున్న కార్మికులు, మృతుని బంధువులు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఇజెడ్ లోని ఆర్‌సిఎల్ పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో పూడిమడక గ్రామానికి చెందిన కొవిరి పెంటయ్య అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదవశాత్తు క్రేన్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆయన సంవత్సర కాలంగా ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారు. మృతుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని ఆర్‌సిఎల్ పరిశ్రమ ప్రధాన గేటు ఆవరణలో మత్స్యకారులు, సిఐటియు నాయకులు బైఠాయించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. న్యాయం జరిగేంత వరకూ పోరాడతామని తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో మత్స్యకార మత్స్యకార సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు. పరిశ్రమ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో నటి జాన్వీకపూర్

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని విఐపి బ్రేక్ దర్శన సమయంలో సినీనటి జాన్వీకపూర్ సోమవారం దర్శించుకున్నారు. ఆమె వెంట తన స్నేహితుడు శిఖర్ పహారియా సైతం ఉన్నారు.

సిఎస్‌తో జపాన్ కౌన్సిల్ జనరల్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డితో జపాన్ కౌన్సిల్ జనరల్ (చెన్నై) తగమసయుకి సచివాలయంలో సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీలో జపాన్ కౌన్సిల్ జనరల్‌తోపాటు వారి ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'కాపలా' నాటికలో సన్నివేశం

'కాపలా' ఉత్తమ నాటిక

- ముగిసిన పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట/యడ్లపాడు (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా యడ్లపాడు మండల కేంద్రంలో మూడ్రోజుల పాటు పండుగ వాతావరణంలో నిర్వహించిన పుచ్చలపల్లి సుందరయ్య 20వ నాటకోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా ఎంపిక చేసిన పది నాటికలను ఎంవి చౌదరి కళావేదికపై ప్రదర్శించారు. యల్లాప్రగడ భాస్కరరావు రచించగా వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో రసఝురి నిడుబ్రోలు వారు ప్రదర్శించిన 'కాపలా' నాటికకు మొదటి బహుమతి దక్కింది. తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి 'వెండిఅంచులు' నాటికకు ద్వితీయ బహుమతి, పండు క్రియేషన్ కొప్పోలు వారి 'పక్కింటి మొగుడు' తృతీయ బహుమతి పొందాయి. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.22 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలతోపాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ రచయితగా యల్లప్రగడ భాస్కరరావు (కాపలా), ఉత్తమ దర్శకులుగా గంగోత్రి సాయి (వెండి అంచులు) ఎంపికయ్యారు. ఉత్తమ రంగాలంకరణకు చైతన్య స్రవంతి యూనిట్ విశాఖ (ఎస్-11), ఉత్తమ సంగీత దర్శకులుగా కెజెడి కార్తికేయకు (కపిరాజు), ఉత్తమ ఆహార్యానికిగాను ఎం గణేష్‌బాబు(కపిరాజు) బహుమతులు అందుకున్నారు. ఐదుగురు ఉత్తమ నటుల్ని ఎంపిక చేయగా అమృతవర్షిణి (ప్రక్షాళన), బి చలం (కొత్తపరిమళం), దివాకర్ (కపిరాజు), కుసుమసాయి (కాపల), బి వనిత (స్వీకారం) అవార్డులకు దక్కాయి. ఉత్తమ సహాయ నటులుగా ఇ పున్నయ్య చౌదరి (ప్రక్షాళన), ఉన్నం వెంకట శేషయ్య (పక్కింటి మొగుడు), వై అనిల్ కుమార్ (ఎస్-11), పివిఆర్ మూర్తి (ప్రేమతో నాన్న), వసంత యామిని (వెండి అంచులు) ఎంపికయ్యారు. వీరందరికీ నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందించారు. న్యాయనిర్ణేతలుగా శాంతారావు, భరద్వాజ, దశరథ వ్యవహరించినట్లు కార్యక్రమ నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు.

బోస్టన్‌లో ఇండో -అమెరికన్ డేటా అనలిస్ట్ దుర్మరణం

బోస్టన్ : నలభై ఏడేళ్ల ఇండో- అమెరికన్ డేటా అనలిస్టు విశ్వచంద్ కొల్లా బోస్టన్ విమానాశ్రయంలో జరిగిన ఒక ప్రమాదంలో మరణించారు. ఈ ఘటన మార్చి 28న చోటుచేసుకున్నా మీడియాకు ఆలస్యంగా తెలిసింది. భారత్ నుంచి విచ్చేసిన సంగీత విద్వాంసుడు అయిన తన మిత్రుణ్ణి రిసీవ్ చేసుకోవడానికి ఆయన బోస్టన్ విమానాశ్రయానికి వెళ్లాడు. మిత్రుని కోసం విమానాశ్రయంలో తన కారు డ్రైవింగ్ సీటు వైపు నిల్చొని ఎదురు చూస్తుండగా ఇంతలో అటు పక్కనుంచి వచ్చిన ట్రావెలర్ బస్ ఢీకొనడంతో విశ్వచంద్ అక్కడికక్కడే మరణించారు.

సీమను ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్‌హబ్ గా మారుస్తాం

- యువగళంలో లోకేష్ హామీ


ప్రజాశక్తి - బత్తలపల్లి (సత్యసాయి జిల్లా)


ఐటి హబ్‌గా మార్చాలని కోరుతూ లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

రాయలసీమను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారుస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీనిచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం 59వ రోజుకు చేరుకుంది. సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ముష్టూరు క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర సంజీవపురం, యర్రాయపల్లి, మన్నీల మీదుగా రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. రాప్తాడు నియోజకవర్గంలో మన్నీల క్రాస్, కృష్ణంరెడ్డిపల్లి, ఇటుకలపల్లి, ఎస్‌కె యూనివర్సిటీ మీదుగా పంగల్‌రోడ్డులోని విడిది కేంద్రం వరకు కొనసాగింది. ముష్టూరు వద్ద రైతులు, సంజీవపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో విద్యార్థులతో లోకేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉత్తరాంధ్రలో ఐటి కంపెనీలను ప్రోత్సహించామన్నారు. దీనిని కొనసాగిస్తూ 2024లో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే రాయలసీమకు పలు కంపెనీలను తీసుకువస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి యువత ఉద్యోగాలు చేసుకోవాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తామని హామీనిచ్చారు. రైతాంగ సమస్యలను తెలుగు రైతు అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు నాయుడు, గంటాపురం జగ్గుల ఆధ్వర్యంలో లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి అధికారంలోకి రాగానే వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. అకాల వర్షాలతో మూడేళ్లుగా వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోతున్నా.. ప్రభుత్వం పరిహారం చెల్లించడం లేదని విమర్శించారు. సేకరించిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించకుండా అన్నదాతలను ఇబ్బంది పెడుతున్నారని, క్రాప్ ఇన్సూరెన్స్, సబ్సిడీలు కేవలం 20 శాతం మందికి అందుతున్నాయని విమర్శించారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గండుమల తిప్పేస్వామి నాయకులు మదమంచి స్వరూప, బోయపాటి అప్పస్వామి నాయుడు, రాఘవంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీచర్లపై పెరిగిపోతున్న పనిభారం

- బ్రిటన్ విద్యా రంగంలో పొదుపు చర్యల ఫలితం



లండన్ : పొదుపు చర్యలతో సతమతమవుతున్న విద్యా రంగంలో పనిభారం అనూహ్యంగా, నిర్వహణకు ఏమాత్రం వీలు కానివిధంగా పెరిగిపోతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఇంగ్లండ్, వేల్స్ వ్యాప్తంగా దాదాపు సగం మంది టీచర్లు, అనుబంధ సిబ్బంది ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు ఆ అధ్యయనం తెలిపింది. ఎక్కువ సమయం తాము పనిచేయాల్సి వస్తోందని 35శాతం మంది అభిప్రాయపడగా, మొత్తం సమయమంతా పనికే వెచ్చించాల్సి వస్తోందని మరో 13శాతం మంది వాపోయారని నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ (ఎన్ఇయు) పోల్ తెలిపింది. హేరోగేట్‌లో ఈ ఏడాది ఉపాధ్యాయ యూనియన్ మహాసభల ప్రారంభ సమావేశంలో ఈ పరిశోధనా ఫలితాలను వెల్లడించారు. మరింతమంది సిబ్బందిని తీసుకునేందుకు నిధులను పెంచాలని, తక్కువ శిక్షలతో కూడిన ఇనస్పెక్షన్ వ్యవస్థ వుండాలని, చిన్న తరగతులు వుండాలని మెజారిటీ టీచర్లు కోరుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఒకసారి చెల్లింపుగా వెయ్యి యూరోలు అందజేస్తామని, సెప్టెంబరు నుండి సగటు కంటే తక్కువ ద్రవ్యోల్బణం 4.5శాతం పెరుగుదల వుంటుందని ప్రభుత్వం తాజాగా వేతన ప్రతిపాదన చేసింది. దానిపై ఎన్ఇయు పోలింగ్ ఫలితాలు రావాల్సి వుంది. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించాలని యూనియన్లు చేసిన సిఫార్సును సభ్యులు అనుసరిస్తే, ఏప్రిల్ 27, మే 2 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలు యథాతథంగా జరుగుతాయి.

ఇంగ్లండ్, వేల్స్‌వ్యాప్తంగా 17,800మంది టీచర్లను సర్వే చేశారు. అందులో మూడో వంతు 37శాతంమంది, తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. ఐదో వంతు 21శాతంమంది అనుబంధ సిబ్బంది కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఫిన్లాండ్ ఎన్నికల్లో మితవాద నేషనల్ కొయిలేషన్‌కి స్వల్ప మెజారిటీ

హెల్సింకి : పోటాపోటీగా జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో ఫిన్లాండ్ ప్రధాన కన్జర్వేటివ్ పార్టీ స్వల్ప మెజారిటీ సాధించింది. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో, మధ్యే మితవాద నేషనల్ కొయిలేషన్ పార్టీ (ఎన్‌సిపి)కి 20.8శాతం ఓట్లు లభించాయి. 20.1 శాతం ఓట్లతో మితవాద పాపులిస్ట్ పార్టీ ది ఫిన్స్ రెండో స్థానంలో నిలిచింది. ప్రధాని సానా మారిన్‌కి చెందిన సోషల్ డెమొక్రాట్లకు 19.9శాతం ఓట్లు లభించాయి. ప్రధానమైన మూడు పార్టీలకు దాదాపుగా 20శాతం ఓట్లు చొప్పున రావడంతో ఏ పార్టీ ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితిలో లేదు. ఫిన్లాండ్ పార్లమెంట్‌లోని 200 సీట్లకు 22 పార్టీల నుంచి 2400మందికి పైగా అభ్యర్థులు పోటీ పడ్డారు. తాము విజయం సాధించామని ఎన్‌సిపి నేత పీటరీ ఓర్పో ప్రకటించారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగా ఫిన్లాండ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. యూరప్ యువ నేతల్లో ఒకరైన ప్రధాని సానా మారిన్ తన ఓటమిని అంగీకరించారు. "మనం మొదటి స్థానం గెలుచుకోకపోయినా పార్లమెంట్‌లో మరిన్ని సీట్లు సాధించాం, ఇదొక అద్భుతమైన విజయం." అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మారిన్ స్వదేశంలో ప్రభుత్వ వ్యయం, పెన్షన్లు, విద్య వంటి అంశాల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు.

నాటోలో ఫిన్లాండ్ సభ్యత్వాన్ని ధ్రువీకరించిన టర్కీ

నాటోలో చేరేందుకు ఫిన్లాండ్ పెట్టుకున్న పిటిషన్‌ను టర్కీ పార్లమెంట్ ధ్రువీకరించింది. దీంతో పశ్చిమ దేశాల మిలటరీ కూటమిలో చేరాలని భావిస్తున్న ఫిన్లాండ్‌కు చివరి అడ్డంకి తొలగినట్లైంది.

ఎస్‌బిఐ ఆన్‌లైన్ సేవల్లో తీవ్ర అంతరాయం



హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో సోమవారం ఆ బ్యాంక్ ఆన్‌లైన్ సేవల్లో తీవ్ర అంతరాయం చోటు చేసుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దాదాపు పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. ఎస్‌బిఐ యోనో యాప్, నెట్ బ్యాంకింగ్‌తో పాటు యుపిఐ లావాదేవీలకు వీలు లేకుండా పోయింది. దీంతో ఖాతాదారులు డిజిటల్ చెల్లింపుల్లో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇదే విషయాన్ని పలువురు ఖాతాదారులు సామాజిక మాధ్యమాల్లో తమ బాధను, ఆందోళనను వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం (2022-23) ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ ఒక్కటో తేదిన మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను అధికారికంగా నిలిపివేసింది. ఆ తర్వాత కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు పలువురు పేర్కొన్నారు.

ఇసుక పాలసీ అవినీతిమయం

- సోము వీర్రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇసుక పాలసీ అవినీతిమయమని, ప్రస్తుత ఇసుక పాలసీని ప్రభుత్వం రద్దు చేసి, ఉచిత ఇసుక పాలసీని తీసుకురావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్నారు.

సంపాదకీయం


విద్వేష యాత్రలు

ప్రజల మధ్య ఐక్యత చాటి చెప్పాల్సిన పండగలు మత ఉద్రిక్తతలకు వేదికలు కావడం కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాకే చూస్తున్నాం. శ్రీరామనవమి ఉత్సవాలు కుల, మతాలకతీతంగా ఊరూ వాడా జరుపుకోవడం ఆనవాయితీ. దేశంలో తామే రామభక్తులమని స్వీయ పేటెంట్ బోర్డులు తగిలించుకున్న ఆర్ఎస్ఎస్, అనుబంధ ముఠాలు చివరికి నవమిని సైతం వదలకున్నాయి. గత కొన్నేళ్లకుమల్లేనే ఈ తడవా పరివార్ గ్రూపులు పలు రాష్ట్రాల్లో రెచ్చిపోయాయి. శ్రీరామనవమి ఊరేగింపుల్లో చేరిపోయి విచక్షణారహిత దాడులకు, విధ్వంసాలకు, గృహ, దుకాణాల, వాహనాల దహనాలకు పాల్పడ్డాయి. పోలీస్ వాహనాలపైనా, పోలీసులపైనా గెరిల్లా తరహా దాడులకు తెగబడ్డాయి. ఈ మారు రంజాన్ మాసం, నవమి ఒకే సమయంలో రావడంతో సంఘ పరివారం పథకాలు రచించి మరీ మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని స్వైర విహారం చేసినట్లు సంఘటనలను చూస్తే అర్ధమవుతుంది. ముస్లింల ప్రార్ధనా స్థలాల వద్ద ర్యాలీలు నిర్వహించి వారిని కించపరిచేలా వ్యవహరించాయి మూకలు. డిజె సౌండ్స్‌తో హల్‌చల్ చేసి రెచ్చగొట్టాయి. ఇటువంటి ఉన్మాద చర్యలకు కేంద్ర బిజెపి సర్కారు, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు దన్నుగా నిలవడం దారుణం.

బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో నవమి ప్రదర్శనలు హింసాత్మకమయ్యాయి. బీహార్ నలంద, రోహ్‌తగ్ జిల్లాల్లో ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, ఇతర సంస్థల శ్రేణుల అఘాయిత్యాలు అన్నీ ఇన్నీ కావు. ఘర్షణల్లో ఒకరు చనిపోయినట్లు నితీష్ ప్రభుత్వం ప్రకటించింది. ఎంతో మంది గాయాలపాలయ్యారు. పలు చోట్ల 144 సెక్షన్ ఆంక్షలు అమల్లో ఉన్నాయి. పరిస్థితులు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. బెంగాల్‌లో హౌరా జిల్లా సంఘ్ పరివారం రాళ్లదాడులు, దహనాలతో రణరంగంగా మారింది. త్రిశూలాలు, కత్తులు చేతబూని ముస్లిం మసీదులు, కాలనీలు, ఇళ్లు, దుకాణాల ఎదుట వీరంగం వేశారు. పోలీసులను సైతం దాడులతో నిలువరించారు. నవమి, మరుసటి రోజు హింసాకాండ కొనసాగింది. ఆదివారంనాడు పక్కనున్న హుగ్లికి అల్లర్లు పాకాయి. దాడులకు తెగబడింది బిజెపి, ఆర్ఎస్ఎస్‌లేనని మమత ప్రభుత్వం పేర్కొంది. బిజెపి దన్నుతో పరివారం రెచ్చిపోయి మత విధ్వంసాలకు పాల్పడి ప్రజల్లో అశాంతి, అభద్రత కల్గిస్తున్నాయి. మతోన్మాద ముఠాల ధ్వంస రచనను నిఘా వ్యవస్థలతో పసిగట్టి ప్రజలకు, మైనార్టీలకు భద్రత కల్పించే విషయంలో, అరాచక శక్తులను కఠినంగా శిక్షించడంలో, శాంతి భద్రతల పరిరక్షణలో విఫలమైనట్లు బెంగాల్ సర్కారు భావించాలి.

ఢిల్లీలో నిరుడు ఏప్రిల్‌లో జహంగిర్‌పురిలో జరిగిన మత ఘర్షణలు దేశాన్నే కుదిపేశాయి. అలాంటి సున్నిత ప్రాంతంలో పోలీసుల అనుమతి లేకపోయినా పరివార్ గ్రూపులు శ్రీరామనవమి ర్యాలీ నిర్వహించారు. ఉన్మాద ప్రసంగాలు చేశారు. మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లాలో నవమి ఉత్సవాల సందర్భంగా రెండు ప్రదేశాల్లో రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఉత్తరప్రదేశ్ మధురలో జామా మసీదు పైకప్పు నుంచి కాషాయ జెండాలను ఊపిన వీడియో వైరల్ కావడంతో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఢిల్లీలో శాంతి, భద్రతలు కేంద్ర బిజెపి చేతుల్లో ఉన్నాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అధికారంలో ఉంది. సదరు రాష్ట్రాల్లో 'నవమి' హింసకు బిజెపి మద్దతు, ప్రోత్సాహం ఉండి తీరుతుంది. హైదరాబాద్‌లో సావర్కర్ ఫోటోతో శోభాయాత్ర చేశారు. శ్రీరామనవమికి సీతారామలక్ష్మణులు లేదా హనుమంతుడి బొమ్మలు పెడతారు తప్ప సావర్కర్ ఫోటోను పెట్టరు. అండమాన్ జైలులో శిక్ష అనుభవిస్తూ బ్రిటిష్ వారిని క్షమాపణ కోరుకొని బయట పడిన వ్యక్తిని హీరోగా చెయ్యాలన్న దుర్బుద్ధి ఇందులో దాగుంది. ప్రజల మధ్య మత విద్వేషాల నిప్పు రాజేసి చలి కాచుకునేందుకు సంఘ్ పరివారం, బిజెపి కాచుక్కూర్చుకున్నాయి. ఇవి ఏ చిన్న సందర్భాన్నీ వదిలిపెట్టవు. అది వాటి సహజసిద్ధ నైజం. ప్రజల మధ్య శాంతి సామరస్యాలను దెబ్బ తీస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలను ప్రజలందరూ ఏకోన్ముఖంగా తిప్పికొడితేనే దేశానికి మనుగడ.

మహనీయుల మాట



రైతు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి ఊరుకోడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తీసేస్తాడు. కలుపు తీయని యెడల మంచి పంట రాదని అతనికి తెలుసు. అలాగే మానవ సమాజంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన చాలదు. చెడు నిరోధించాలి.

- గాంధీజీ

mkgandhi

ప్రజాప్రస్థానం

పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల భ్రమ



ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారీ విధానం మొదలైన తొలి కాలంలో అది నిరుద్యోగాన్ని పెంచుతుందని, దాని వలన పేదరికం పెరుగుతుందని...కాని, మొదట్లో కలిగిన ఈ నష్టాన్ని ఆ తర్వాత అది అభివృద్ధి చెందుతున్న కాలంలో పూడ్చివేస్తుందని చాలామందిలో ఒక అభిప్రాయం ఉంది. మొదట్లో ఉపాధి పోగొట్టుకున్నవారంతా ఆ తర్వాత కాలంలో ఉద్యోగాలు పొంది కార్మికులుగా తిరిగి పనుల్లో చేరుతారని, నిరుద్యోగం తగ్గడంతో వేతనాలు పెరగడం ప్రారంభమౌతుందని, వేతనాలు పెరుగుతున్నకొద్దీ కార్మికుల ఉత్పాదకత కూడా పెరుగుతుందని వారు భావిస్తారు.

గత చరిత్ర అనుభవాలు కూడా ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నట్టు పైకి చూస్తే అనిపిస్తుంది కూడా. మార్క్సిస్టు చరిత్రకారుడు ఎరిక్ హాబ్స్‌బామ్ అంచనా ప్రకారం పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం మొదలైన తర్వాత బ్రిటన్ లో నిరుద్యోగం పెరిగింది. కాని 19వ శతాబ్దపు నడిమి కాలం నాటికల్లా పరిస్థితులు మెరుగుపడ్డాయి. కార్మిక వర్గానికి అనుకూలంగా మారాయి. ఈ విధమైన దృక్పథం ఉంటే పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందే సమయంలో ఎన్ని కష్టాలు కలిగినా, ఆ తర్వాత పెట్టుబడిదారీ విధానం వలన కార్మికులకు కూడా ప్రయోజనాలు ఉంటాయి అన్న నిర్ధారణకి వస్తాం.

ఈ విధమైన అవగాహన మొత్తంగానే తప్పు. పెట్టుబడిదారీ విధానం తాను తొలుత కార్మికవర్గానికి కలిగించిన నష్టాన్ని ఆ తర్వాత కాలంలో పూడ్చి వారికి మెరుగైన పరిస్థితులు కల్పిస్తుంది అని భావించడానికి ఎటువంటి సిద్ధాంత ప్రాతిపదికా లేదు. కార్మికుల స్థితిగతులలో తర్వాత కాలంలో కనిపించిన మెరుగుదలకు, పెట్టుబడిదారీ విధానపు సహజ సద్యోజనిత స్వభావానికి ఎటువంటి సంబంధమూ లేదు.

ఇంగ్లీషు ఆర్థిక శాస్త్రవేత్త డేవిడ్ రికార్డో పరిశ్రమల్లో యంత్రాలను వినియోగించడం మొదలుపెట్టిన తొలిరోజుల్లో ఈ విధమైన వాదన ముందుకు తెచ్చాడు. మొదట్లో యంత్రాల వలన కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి కష్టాలపాలౌతారని, కాని ఆ తర్వాత లాభాలరేటు పెరిగి పెట్టుబడి ఎక్కువగా పోగుబడుతుందని, దానితో మరిన్ని ఎక్కువ పరిశ్రమలు వస్తాయని, వాటిలో గతంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న వారందరికీ మళ్ళీ ఉపాధి లభించడమేగాక వారి స్థితిగతులు బాగా మెరుగు పడతాయని రికార్డో ప్రతిపాదించాడు. కార్మికుల జనాభా మరీ ఎక్కువగా పెరిగిపోకుండా ఉండేవిధంగా వాళ్ళు తమను తాము నియంత్రించుకుంటే వారి వేతనాలు పెంచుకోవచ్చునని కూడా ఆయన చెప్పాడు.

రికార్డో వాదనలో రెండు లోపాలు ఉన్నాయి. పరిశ్రమల్లో యంత్రాలను ప్రవేశపెట్టడం అనేది ఒకే ఒక్కమారు జరిగే ప్రక్రియగా ఆయన అభివర్ణించాడు. కాని వాస్తవంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో కొత్త కొత్త యంత్రాలను, నూతన ఉత్పత్తి ప్రక్రియలను ప్రవేశపెట్టడం అనేది నిత్యం జరుగుతూనే వుంటుంది. యంత్రాలను మొదట ప్రవేశపెట్టినప్పుడు పెట్టుబడిదారుల లాభాల రేటు పెరగడం అనేది జరిగినా, వారి వద్ద పెట్టుబడి ఎక్కువగా పోగుబడినా, దాని ఫలితంగా అంతకు ముందు కోల్పోయిన ఉద్యోగాలన్నీ



> **సంపన్న దేశాలలో ఉత్పత్తి అయిన సరుకులకు డిమాండ్ కల్పించడానికి, తద్వారా సంపన్న దేశాలలో అదనపు ఉద్యోగాలు కల్పించడానికి సామ్రాజ్యవాదులు తాము ఆక్రమించుకున్న వలసలలో చేతి వృత్తిదారులను, చిన్న తరహా ఉత్పత్తిదారులను భారీ స్థాయిలో దెబ్బ తీశారు. అంటే ఒకవిధంగా సామ్రాజ్యవాదం సంపన్న దేశాలలోని నిరుద్యోగాన్ని వలస దేశాలలోకి ఎగుమతి చేసిందన్నమాట. ఆ వలస దేశాలకు తమ తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోగలిగిన సత్తా లేదు. అవన్నీ సంపన్న దేశాల ఆధీనంలోనే ఉండేవి.**

మళ్ళీ రావడం అనేది ఎన్నటికీ జరగదు. ఎందుకంటే ఈ లోపునే మళ్ళీ కొత్త యంత్రాలను ప్రవేశపెట్టడం అనేది జరిగిపోతూ వుంటుంది.

అందుచేత ఈ విషయాన్ని నిరంతరం మారుతూ వుండే క్రమంలోనే చూడాలి. పరిశ్రమల్లో పెట్టే పెట్టుబడి వృద్ధి చెందే రేటు 'జి' అనుకుందాం. అప్పుడు ఉత్పత్తి వృద్ధిరేటు కూడా 'జి' యే ఉంటుంది (ఒకవేళ సాంకేతిక పరిజ్ఞానం పెంచడం కోసం అదనపు పెట్టుబడి పెట్టినా, దాని వలన శ్రామికులకు చెల్లించే వేతనాలు ఆ మేరకు తగ్గుతాయే కాని ఉత్పత్తి అయ్యే సంపదలో వృద్ధిరేటు మాత్రం పెట్టుబడిలో వృద్ధిరేటు ఎంత ఉంటుందో, అదే మోతాదులో ఉంటుంది). శ్రామిక ఉత్పాదకత వృద్ధిరేటు 'పి' అనుకుందాం. అప్పుడు అదనపు కార్మికుల అవసరం పెరిగే రేటు జి-పి ఉంటుంది. కార్మికుల జనాభా పెరిగే రేటు 'ఎన్' అనుకుంటే జి-పి కన్నా ఎన్ తక్కువ ఉన్నప్పుడే నిరుద్యోగం తగ్గుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జి-పి విలువ ఎన్ ను దాటి ఉండేట్టు చూసే ఏర్పాటు ఏదీ లేదు.

కార్మికుల ఉత్పాదకత పెరుగుతూ మరోవైపు నిరుద్యోగం రేటు కూడా పెరుగుతూ వుంటే (అప్పుడు వేతనాల రేటు కనీస స్థాయిలోనే ఎప్పుడూ ఉండిపోతుంది) లాభాల రేటు పెరుగుతూ పోతుంది. దానివలన అదనపు పెట్టుబడి పోగుబడుతుంది. దానిని వినియోగించినప్పుడు కొత్త ఉద్యోగాలు వస్తాయి. అప్పుడు నిరుద్యోగం పడిపోతుంది. - రికార్డోను సమర్ధించేవారి వాదన ఈ విధంగా ఉంటుంది.

ఇక్కడే రికార్డో వాదనలోని రెండో సమస్య ముందుకొస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అయే సరుకులకు డిమాండు ఎప్పుడూ పెరుగుతూనే వుంటుంది అని రికార్డో భావించాడు. అందువలన ఉత్పత్తి పెరిగితే దాని ఫలితంగా లాభాలు పెరుగుతాయని, దానివలన అదనపు పెట్టుబడి పోగుబడుతుందని, ఈ ప్రక్రియకు ఎటువంటి ఆటంకమూ ఉండదని అతను భావించాడు. "సరుకులు ఎంత ఎక్కువగా మార్కెట్ లోకి వస్తే అంత ఎక్కువ డిమాండ్ వాటికి ఉంటుంది" అన్న సూత్రాన్ని అతను విశ్వసించాడు. కాని లాభాలు రావాలంటే ఎక్కువ సరుకులు ఉత్పత్తి చేసినంత మాత్రాన సరిపోదు. అవన్నీ అమ్ముడుపోయినప్పుడే వాస్తవంగా పెట్టుబడిదారుడికి లాభం పోగుపడుతుంది. ఉత్పత్తి అయిన సరుకులన్నీ అమ్ముడుపోవాలంటే అది కొనుగోలుశక్తిని బట్టి ఉంటుంది. కొనుగోలుశక్తి వేతనాల రేటుని బట్టి ఉంటుంది. మరి వీలైనంత తక్కువ స్థాయిలో వేతనాలను ఉంచాలని పెట్టుబడిదారులు నిరంతరం ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు మార్కెట్ లో డిమాండ్ నిరంతరం పెరగడానికి గ్యారంటీ ఏమిటి? అందుచేత సాంకేతిక పరిజ్ఞానం పెరిగి దాని ఫలితంగా నిరుద్యోగం పెరిగితే, ఆ విధంగా ఉద్యోగాలను పోగొట్టుకున్నవారిని తిరిగి ఉద్యోగాలలో పెట్టుకోడానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎటువంటి ఏర్పాటూ లేదు. అందుచేత పెట్టుబడిదారీ విధానం ప్రారంభదినాల్లో కార్మికులకు నష్టం కలిగించినా, తర్వాత అది పుంజుకున్నాక కార్మికులకు మేలు జరుగుతుందన్న రికార్డో వాదనకు ఎటువంటి సైద్ధాంతిక ప్రాతిపదికా లేదు.

కాని వాస్తవ చరిత్ర చూస్తే సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడం జరిగాక అక్కడి కార్మికుల స్థితిగతులు మెరుగుపడ్డాయి. దీనిని ఎలా అర్థం చేసుకోవాలి? యూరప్ ఖండం లోని కార్మికులు చాలా భారీ సంఖ్యలో "కొత్త ప్రపంచానికి" (అంటే అమెరికా ఖండానికి) వలసలు పోయారు. ఈ వలసలు మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యేదాకా (1914) కొనసాగాయి. 19వ శతాబ్దంలో నెపోలియన్ యుద్ధం నాటినుండి మొదటి ప్రపంచయుద్ధం దాకా మధ్య కాలంలో దాదాపు 5 కోట్ల మంది యూరోపియన్ కార్మికులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు వలసలు పోయారని ఆర్థికవేత్త ఆర్థర్ లూయిస్ అంచనా వేశాడు.

ఈ వలసలు "అధిక వేతన" వలసలు. అంటే ఆ కార్మికులు అంతవరకూ ఉండిన స్వస్థలాల్లోనూ, అదే విధంగా వాళ్ళు వలసలు పోయిన కొత్త ప్రదేశాల్లోనూ వేతనాలు అధికస్థాయిలో ఉన్నాయి. ఇదే కాలంలో "అల్ప వేతన" వలసలు కూడా మరోవైపు కొనసాగాయి. ఈ రెండో తరహా కార్మిక వలసలు ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాలైన ఇండియా, చైనా వంటి దేశాలనుండి ఫిజీ, మారిషస్, వెస్ట్ ఇండీస్, తూర్పు ఆఫ్రికా, నైరుతి అమెరికా వంటి ఉష్ణ, సమశీతోష్ణ ప్రదేశాలకు జరిగాయి. ఇక్కడ ఆ కార్మికుల స్వంత దేశాలలోనూ, వాళ్ళు వలసలు వచ్చిన దేశాల్లోనూ వేతనాల స్థాయి తక్కువగానే ఉంది. ఈ కార్మికులను శ్వేతజాతి కార్మికులు వలసలు వచ్చిన ప్రదేశాలకు రానివ్వలేదు (ఇప్పటికీ కోరుకున్న వారందరినీ అక్కడికి వలసలు రానివ్వడం లేదు).

ఇలా ఒకవైపు అధిక వేతన వలసలు, మరోవైపు అల్పవేతన వలసలు ఎందుకు జరిగాయి? దీనికి లూయిస్ చెప్పిన సమాధానం ఏమిటంటే, ఆ కాలంలో బ్రిటన్ లో వ్యవసాయ విప్లవం జరిగి, తక్కిన యూరప్‌కంతటికీ విస్తరించింది అని, దాని వలన గ్రామీణ కార్మికులకు యూరప్ లో ఆదాయాలు బాగా పెరిగాయని అతను అన్నాడు. కాని ఆ విధమైన వ్యవసాయ విప్లవం ఏదీ బ్రిటన్ లో జరిగిన దాఖలాలు లేవు. మరి అసలు కారణం ఏమిటి? అధిక వేతన వలసల విషయంలో జరిగినదేమంటే యూరప్ నుండి వలసలు పోయినవారు అమెరికా, ఆస్ట్రేలియా తదితర ప్రదేశాలలోని స్థానికులను వారి వారి భూముల నుండి తరిమివేసి ఆక్రమించుకుని వ్యవసాయదారులుగా స్థిరపడి అధిక ఆదాయాలు ఆర్జించసాగారు. మరోవైపు యూరప్ లో కార్మికవర్గం సంఖ్య వలసల కారణంగా తగ్గిపోయింది. అందుచేత ఇక్కడ కూడా కార్మికుల వేతనాలను పెంచక తప్పలేదు. ఒక శీతల దేశం నుండి మరొక శీతల దేశానికి జరిగిన వలసలు భారీ స్థాయిలో ఉన్నాయి. 1820 నుండి 1915 మధ్య బ్రిటన్ లో ఎంత మేరకు జనాభా పెరిగిందో, అందులో సగం మేరకు అక్కడి నుండి వలసలు పోయారు. ఇటువంటి స్థాయిలోనే మన దేశంలో కూడా వలసలు జరిగివుంటే స్వతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివకూ దాదాపు 50 కోట్ల మంది వలసలు పోయివుండాలి (యూరప్ లో జరిగిన వలసల ప్రభావం ఎంత బలంగా ఉండిందో బోధపడడానికి ఈ పోలిక చూపడం జరిగింది.). ఆ విధంగా ఇతర దేశాలకు తరలిపోవడానికి యూరోపియన్ కార్మికులకు లభించిన అవకాశాలు వారి స్థితిగతులు బాగా మెరుగుపడడానికి దోహదం చేశాయే తప్ప పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి క్రమంలో స్వత:సిద్ధంగా కార్మికుల స్థితి గతులను మెరుగుపరిచే ఏర్పాటు అంటూ ఏదీ లేదు. ఇలా వేరే దేశాలకు పోయి అక్కడి స్థానికులను వెళ్ళగొట్టి వారి భూములను ఆక్రమించుకునే అవకాశం సామ్రాజ్యవాద దురాక్రమణ స్వభావం నుంచి వచ్చింది.

> **పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందితే మొదట్లో కార్మికులు నష్టపోయినా, ఆ తర్వాత వారూ ప్రయోజనం పొందుతారన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా ఒకానొక ప్రత్యేక, చారిత్రిక పరిస్థితుల్లో యూరప్ ఖండంలోని కార్మికుల స్థితిగతులు పైన వివరించిన విధంగా మెరుగుపడడం సంభవించిందే తప్ప అదేదో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగినది కాదు.**

సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా సంపన్న దేశాలలోని కార్మికుల స్థితిగతులు మెరుగుపడే అవకాశం వచ్చింది. ఇది కేవలం స్థానికులనుండి భూములను లాక్కోవడం ద్వారా మాత్రమే కాదు. సంపన్న దేశాలలో ఉత్పత్తి అయిన సరుకులకు డిమాండ్ కల్పించడానికి, తద్వారా సంపన్న దేశాలలో అదనపు ఉద్యోగాలు కల్పించడానికి సామ్రాజ్యవాదులు తాము ఆక్రమించుకున్న వలసలలో చేతివృత్తిదారులను, చిన్న తరహా ఉత్పత్తిదారులను భారీ స్థాయిలో దెబ్బ తీశారు. అంటే ఒకవిధంగా సామ్రాజ్యవాదం సంపన్న దేశాలలోని నిరుద్యోగాన్ని వలస దేశాలలోకి ఎగుమతిచేసిందన్నమాట. ఆ వలస దేశాలకు తమ తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోగలిగిన సత్తా లేదు. అవన్నీ సంపన్న దేశాల ఆధీనంలోనే ఉండేవి.

అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందితే మొదట్లో కార్మికులు నష్టపోయినా, ఆ తర్వాత వారూ ప్రయోజనం పొందుతారన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. సామ్రాజ్యవాద దోపిడీ పద్ధతుల కారణంగా ఒకానొక ప్రత్యేక, చారిత్రిక పరిస్థితుల్లో యూరప్ ఖండంలోని కార్మికుల స్థితిగతులు పైన వివరించిన విధంగా మెరుగుపడడం సంభవించిందే తప్ప అదేదో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో జరిగినది కాదు. దీనిని బట్టి యూరప్ ఖండంలోని కార్మికులు సామ్రాజ్యవాద దోపిడీ పట్ల మెతకగా ఉంటారన్న అభిప్రాయానికి రాకూడదు. సామ్రాజ్యవాద దోపిడీ విధానం నడిచే తీరు ఇలానే ఉంటుంది.

(స్వేచ్ఛానుసరణ)

సమస్య

ఆర్టీసిని రక్షించుకుందాం



అయ్యప్ప రెడ్డి

> **ఆర్.టి.సి వనంలో అద్దె బస్సులంటే అవి సంస్థలను మింగే భూతాలే. ఈ విషయం ఆర్.టి.సి అధికారులకు అర్థమవుతున్నప్పటికీ అమాయకత్వాన్ని నటిస్తున్నారు. ఒకప్పుడు కేవలం పల్లెవెలుగు బస్సులు మాత్రమే అద్దెకు తీసుకున్నారు. నేడు అవే కాకుండా అన్ని స్పెషల్ పర్పస్ (ఎక్స్‌ప్రెస్/ డీలక్స్ /సూపర్ లగ్జరీ /ఇంద్ర / స్టార్ లైనర్) బస్సులను అద్దెకు తీసుకుంటూ సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. సిబ్బందిని బాగా తగ్గిస్తున్నారు. ఎప్పటికప్పుడు కుదిస్తున్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మాత్రమే తీసుకుంటున్నారు. దేశ రక్షణకు సైన్యం అవసరం. సంస్థ రక్షణకు కార్మికులు అవసరం.**



కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, రవాణా రంగ విధ్వంసకర విధానాలను అనుసరిస్తోంది. 'మోటారు వాహన సవరణ చట్టం-2019' ద్వారా ఆర్.టి.సి లకు చరమ గీతం పాడాలని చూస్తున్నది. దీనిపై కార్మికుల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గినట్లు నటించినా అందులోని కీలకమైన అంశాలను అమలు చేస్తున్నది. 2022 ఏప్రిల్ ఒకటి నుండి ఈ చట్టాన్ని అమలు చేస్తున్నది. దీని ద్వారా సాధారణ నిర్లక్ష్యాలకు కూడా విపరీతమైన పెనాల్టీలు వేస్తున్నది. మొదటిసారి నిర్లక్ష్యానికి రూ. 500 నుండి రూ. 1000కి పెంచింది. పోలీస్ శాఖకు పెనాల్టీల టార్గెట్లు పెంచారు. దాంతో వాహనదారులు, డ్రైవర్లు పెనాల్టీల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు.

వెహికల్ స్క్రాపింగ్ పాలసీ

ఈ చట్టం ద్వారా తొమ్మిది లక్షల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆర్.టి.సి బస్సులను, వాహనాలను స్క్రాప్ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధానం ద్వారా వేల ఆర్.టి.సి బస్సులను స్క్రాప్ చేస్తారు. దీంతో ఆర్.టి.సి లకు బస్సులు లేకుండా పోతాయి. వాటి స్థానంలో ప్రైవేటు బస్సులకు, ప్రైవేట్ రవాణా సంస్థలకు పెద్ద పీట వేస్తారు. ఫలితంగా ప్రభుత్వ రంగ రవాణా సంస్థలు కనుమరుగై పోతాయి. ఈ కాలంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత పెరిగింది. అందులో భాగంగా ఆర్.టి.సి లో కూడా ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయి. కేంద్రమే సమకూరు స్తున్నది. బస్సులను ఆర్.టి.సి కి ఇవ్వకుండా ప్రైవేట్ కన్సార్టియంలకు ఇస్తున్నారు. వాటికి ఎక్కువ రేటు నిర్ణయిస్తున్నారు. అదంతా ఆర్.టి.సి చెల్లించాలి. కాబట్టి ఆర్.టి.సి కి నష్టం పెరుగుతున్నది.

డీజిల్ దెబ్బ

2019 నుండి ఇప్పటికి సుమారు 19 సార్లు కేంద్రం డీజిల్ రేట్లు పెంచింది. ఫలితంగా ప్రతి కిలోమీటర్‌పైన ఆర్.టి.సి ఖర్చు పెరిగింది. ఆర్.టి.సి ఎంత ఆదాయం తెచ్చినా నష్టాల్ని చవిచూడ డానికి కారణం డీజిల్ రేట్లు పెరగడం తప్ప మరొకటి కాదు.

బల్క్ బయ్యర్ పాలసీ

ఇదొక విడ్డూరపు పాలసీ. ప్రపంచంలో ఎక్కడైనా టోకు ధరలు తక్కువగా ఉండి రిటైల్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఇక్కడ రివర్స్‌లో ఉన్నది. బల్క్ బయ్యర్‌కు అంటే పెద్ద మొత్తంలో డీజిల్ కొనేవారికి, ఆర్.టి.సి లకు ఎక్కువ రేటుకు అమ్మాలని కేంద్రం నిర్ణయించింది. ఫలితంగా ఆర్.టి.సి లకు అదనపు భారం పడింది. కేవలం ఆర్.టి.సి లను దెబ్బతీయడానికి కేంద్రం కావాలనే ఈ బల్క్ బయ్యర్ పాలసీని తీసుకొచ్చింది.

నిధుల ఎగవేత

1950 ఆర్.టి.సి యాక్ట్ ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 నిష్పత్తిలో ఆర్.టి.సి లకు నిధులు సమకూర్చాలి. కానీ 1989 నుండి కేంద్రంగానీ రాష్ట్రంగానీ ఒక రూపాయి కూడా ఆర్.టి.సి లకు పెట్టుబడులు సమకూర్చలేదు. అంటే 34 సంవత్సరాల నుండి కేంద్రం రాష్ట్రం పూర్తిగా నిధులు ఇవ్వలేదు. మన రాష్ట్ర బడ్జెట్ రెండు లక్షల 97 వేల కోట్లు. అందులో ఒక శాతం అంటే 2970 కోట్లు. అంటే 1000 కోట్లు సాలీనా ఆర్.టి.సి కి ఇస్తే బడ్జెట్లో కేవలం 0.3 శాతం అవుతుంది. ప్రతి రోజు 75 లక్షల మంది ప్రయాణికులను చేరవేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఎ.పి.ఎస్.ఆర్.టి.సి కి ప్రభుత్వం బడ్జెట్లో 0.3 శాతం నిధులు కేటాయించలేదా? మరి నిధులన్నీ ఎవరి కోసం ఖర్చు చేస్తున్నారు? కేంద్రం 500 కోట్లు కేటాయించాలి. కేంద్రం, రాష్ట్రం కలిపి సాలీనా 1500 కోట్లు కేటాయించాలి. 34 సంవత్సరాలు నుండి కేంద్ర రాష్ట్రాలు కలిపి 51 వేల కోట్లు రూపాయలు ఆర్టీసీకి నిధులు ఇవ్వలేదు. ఈ 51,000 కోట్ల రూపాయల నిధులు ఆర్.టి.సి తన అంతర్గత వనరుల నుండి అంతర్గత సామర్థ్యం ద్వారా సమకూర్చుకుంది. కానీ ఆర్.టి.సి అప్పుల్లో ఉన్నదని ప్రభుత్వాలు నేడు కోడై కూస్తున్నాయి. ఇది న్యాయమా?

ఎం.వి టాక్స్ వడ్డింపు

ప్రైవేటు బస్సులకు సీట్ పర్ క్వార్టర్ టాక్స్ విధానం ఉంది. కానీ ఆర్.టి.సి గ్రాస్ కలెక్షన్ మీద టాక్స్ చెల్లించాలనే చట్టం తెచ్చారు. ఫలితంగా ఆర్.టి.సి లపై ఎం.వి టాక్స్ భారం పెరిగింది. ఆర్.టి.సి లు పుంజుకోలేకపోతున్నాయి.

తోలుతీస్తున్న టోల్గేట్

ఆర్.టి.సి లకు టోల్గేట్ల భారం నానాటికి పెరిగిపోతున్నది. నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలపై 50 కిలోమీటర్లకు ఒక టోల్గేట్ పెట్టి వాహనదారుల నుండి ముక్కు పిండి టోల్గేట్ వసూలు చేస్తున్నారు. గతంలో 24 గంటల వరకు అప్ అండ్ డౌన్ టికెట్ చెల్లిస్తే సరిపోయేది. కానీ ఇప్పుడు ట్రిప్పు ట్రిప్పుకు టోల్ గేట్ వసూలు చేస్తున్నారు. టోల్గేట్ల నుండి ఆర్.టి.సి లకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. తాజాగా 2023 ఏప్రిల్ ఒకటి నుండి టోల్గేట్ చార్జీలు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. నిజానికి ఇప్పుడు పెంచాల్సిన అవసరం లేదు. సిబ్బందిని ఏమైనా పెంచారా? ఉన్న సిబ్బందికి వేతనాలు ఏమైనా పెంచారా? మోనెటైజేషన్ (ఎన్ఎంపి)లో భాగంగా రోడ్లన్నిటినీ కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న కుట్ర జరుగుతోంది. రోడ్లను వారు హస్తగతం చేసుకుని తర్వాత చార్జీలు పెంచేకన్నా ముందుగానే టోల్‌గేట్ రేట్లు పెంచి కార్పొరేట్లకు అప్పజెప్పి అప్పనంగా ప్రజల సొమ్ము కార్పొరేట్లకు దోచిపెట్టాలనుకుంటోంది. ఆర్.టి.సి పెద్ద మొత్తంగా టోల్గేట్ అమౌంట్ చెల్లించాల్సి వస్తోంది. సంస్థపై ఆర్థిక భారం పడుతున్నది.

ఆర్.టి.సి స్థలాల అన్యాక్రాంతం-అద్దె బస్సులు

ఎ.పి.ఎస్.ఆర్.టి.సి 129 డిపోలు బస్ స్టేషన్లతో దివ్యంగా ఉంది. నగరాల నడిబొడ్డులో ఉన్న ఇలాంటి స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ల పేరుతో బస్టాండ్లను 44 సంవత్సరాల పాటు బడా వ్యాపారవేత్తలకు లీజుకు ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్.టి.సి మనుగడ ఎలా సాధ్యం?

ఆర్.టి.సి వనంలో అద్దె బస్సులంటే అవి సంస్థలను మింగే భూతాలే. ఈ విషయం ఆర్.టి.సి అధికారులకు అర్థమవుతున్నప్పటికీ అమాయకత్వాన్ని నటిస్తున్నారు. ఒకప్పుడు కేవలం పల్లెవెలుగు బస్సులు మాత్రమే అద్దెకు తీసుకున్నారు. నేడు అవే కాకుండా అన్ని స్పెషల్ పర్పస్ (ఎక్స్‌ప్రెస్/ డీలక్స్ /సూపర్ లగ్జరీ /ఇంద్ర / స్టార్ లైనర్) బస్సులను అద్దెకు తీసుకుంటూ సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. సిబ్బందిని బాగా తగ్గిస్తున్నారు. ఎప్పటికప్పుడు కుదిస్తున్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మాత్రమే తీసుకుంటున్నారు. దేశరక్షణకు సైన్యం అవసరం. సంస్థ రక్షణకు కార్మికులు అవసరం.

ఆర్థిక దోపిడి

2020 జనవరి తరువాత ఆర్.టి.సి కార్మికులకు ఒక్క రూపాయి జీతం పెరగలేదు. 10.1 శాతం డిఏ పెండింగ్‌లో ఉంది. ఎన్‌కాష్మెంట్ ఇవ్వలేదు. ఆరు ఎన్‌కాష్మెంట్లు ఇవ్వాలి. 2017 సంవత్సరపు పేఅరియర్లు ఇవ్వలేదు. ఏ విధమైన అలవెన్స్‌లు ఇవ్వడం లేదు. హెచ్ఆర్ఏ 4 శాతం తగ్గించారు. పాత ఫిట్మెంట్లో 1.6 బేసిక్ తగ్గించారు. 2020 జనవరి నుండి ఏ విధమైన ఆర్థిక వెసులుబాటు లేకుండా పోయింది. ఈ విధంగా సంస్థపై ముప్పేట దాడి జరుగుతున్నది.

ఇదిలా వుండగా...ప్రతిఘటన, పోరాటం, ఆందోళనలు చేయరాదని అటు ప్రభుత్వం ఇటు యాజమాన్యం ఊదరగొడుతున్నాయి. ఇది నిజమేమోనని కొన్ని కార్మిక సంఘాలనుకుంటున్నాయి. కార్మికులకు చెపుతున్నాయి. ఈ విధానం మారాలి. సంస్థ రక్షణకు ఆర్.టి.సి లో ఐక్య ఉద్యమ నిర్మాణం జరగాలి. సుదీర్ఘ పోరాటం జరగాలి.

దేశ ఆర్థిక స్వావలంబన, సార్వభౌమత్వాన్ని...ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునేందుకు దేశ కార్మిక వర్గంలో భాగమైన ఆర్.టి.సి కార్మికులందరూ ఏప్రిల్ 5కి ఢిల్లీకి కదలాలి. ప్రభుత్వ రంగం జోలికొస్తే ప్రభుత్వాల కూసాలు కదులుతాయని నినదించాలి. పోరాడితే పోయేదేమీ లేదు ప్రభుత్వ రంగ రక్షణ తప్ప.

/వ్యాసకర్త ఎ.పి.ఎస్.ఆర్.టి.సి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి/

కవిత్వం

కోడి కూత

అర్ధరాత్రికి ముందే అబద్ధపు కోళ్ళు
ఊళ్లేగడం మొదలెడతాయి
తెల్లారేసరికీ తమ గంతల కట్టలోంచి
గేట్ల పైనుండి ఇళ్లల్లోకి గెంతుతూ
లేచినోళ్లను, లేవబోతున్నవాళ్లనూ
తిరిగి జోకొట్టి బజ్జోబెడతాయి
ఒక్కో బుట్టలోంచి ఎగిరి పడుతూ
ఒక్కో రంగు కోడి తన కూతే
వినమని అదే ఘనమని
పోటీ పడి మరీ బురిడీ కొట్టించి
ఎండమావిలోకి ముంచేస్తాయి
అబద్ధాలను గుడ్డిగా నమ్మడమే
నైజంగా పెట్టుకున్న మనం కోళ్లఫారాల
నమ్మకాన్ని వమ్ము చేయం
అడపాదడపా ఏదో మూల నుండి
సన్నగా నిజం ధైర్యం చేసి
గొంతు చించుకుంటున్నా
ఈ కృత్రిమ మిమిక్రీ కోళ్ల
అందమైన అబద్ధాల రెక్కలకు కింద
కట్టి ఉన్న కోడి కత్తి నిజం పీకను
నిర్దాక్షిణ్యంగా తెగేస్తుంది
అవసరానికి ఈ దొంగకోళ్లన్నీ ఏకమై
చీకటి లోంచి చీకట్లను
చీల్చి మేల్కొల్పాల్సిన మనల్ని
తిరిగి చీకటి లోకి నెట్టేసి
అబద్ధాలను పొదుగుతూ
నిజాలను హత్య చేస్తాయి.

- డా॥ మాటూరి శ్రీనివాస్,
సెల్ : 9849000037

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

కార్పొరేట్ల లాభాల కోసం

మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బ

- బడ్జెట్‌లో మత్స్య పరిశ్రమకు అరకొర కేటాయింపు
- ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ పార్లమెంట్ మార్చ్‌లో తపన్ సేన్, హేమలత


ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ పార్లమెంట్ మార్చ్‌లో మాట్లాడుతున్న తపన్ సేన్


సభలో వలను ప్రదర్శిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ పాలనలో దేశంలోని మత్స్యకారులు, మత్స్య కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని సిఐటియు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె హేమలత, తపన్ సేన్ విమర్శించారు. కార్పొరేట్లకు సముద్ర తీర ప్రాంతాన్ని తాకట్టు పెడుతోందని, మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభుత్వం దెబ్బకొడుతోందని ఆగ్రహించారు. సోమవారం నాడు జంతర్ మంతర్ వద్ద అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య (ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యాన పార్లమెంటు మార్చ్ జరిగింది. సిపిఎం ఎంపిలు వి శివదాసన్, ఎఎ రహీమ్ సంఘీభావం తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షులు దేబ్ శశి బర్మన్ అధ్యక్షతన జరిగిన ధర్నాను తపన్ సేన్ ప్రారంభించారు. దేశంలో గత ఎనిమిదేళ్ల నుంచి మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మత్స్య పరిశ్రమ పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్య వృత్తిపై ఆధారపడిన కోట్లాదిమంది జీవితాలను కేంద్రం అగమ్యగోచరంగా మార్చిందన్నారు. కె హేమలత మాట్లాడుతూ.. చేపలను ఎగుమతులు చేసేందుకు దేశంలోని మత్స్యకారులను అనుమతించడం లేదని, సముద్ర ప్రాంతాన్ని వివిధ వ్యాపారాల (హోటళ్లు, రెస్టారెంట్లు, అతిథి గృహాలు వంటి వ్యాపార సంబంధిత వ్యవహారాలు)కు అనుమతిస్తున్నారని విమర్శించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక జైళ్లలో మన దేశ మత్స్యకారులు మగ్గుతున్నారని, కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. మత్స్య సహకార సంఘాలు మాఫియా చేతుల్లో ఉన్నాయని, వారు మత్స్యకారుల నుంచి అధిక రుసుం వసూలు చేస్తున్నారని విమర్శించారు. చేపలు శుద్ధి చేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వటం లేదని, కానీ కార్పొరేట్లు లాభాలు పొందుతున్నారని తెలిపారు. మత్స్యకారులు, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, పెన్షన్, ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ విధానాలు మత్స్యకారులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో విదేశాల నుంచి చేపలు దిగుమతికి సంతకాలు చేశారని, ఇది దేశంలోని మత్స్యకారులకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతోందని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు అన్ని రంగాలనూ లూటీ చేస్తున్నారని, దీనికి మోడీ ప్రభుత్వం మద్దతుగా ఉందని అన్నారు. ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి పుల్లివెల స్టాన్లీ మాట్లాడుతూ.. మత్స్యకారులు, మత్స్య కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల మత్స్యకారులు, చేపల విక్రయదారులు, చేపల ప్రాసెసింగ్ కార్మికులు తదితర అన్ని వర్గాల వారు నానా అవస్థలు పడుతున్నారని, పేదరికం, అప్పులు, కష్టాల్లో జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కోశాధికారి జి మమత, కేరళ మత్స్య ఫెడ్ ఛైర్మన్ టి మనోహరన్, జాతీయ ఉపాధ్యక్షులు మహఫజ్ రహమాన్, జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సిహెచ్ రమణి, వై శ్రీనివాస్, ఎస్ కళావతి, పి నారాయణ, సిహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి

మత్స్యకారుల సమస్యలపై కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలాను ఎఐఎఫ్ఎఫ్‌డబ్ల్యుఎఫ్ బృందం కలిసి ఐదు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది. మత్స్యకారులకు కిరోసిన్, డీజిల్‌ను సబ్సిడీపై అందించాలని, చేపల వేటకు సబ్సిడీల ఉపసంహరణపై డబ్ల్యుటిఒ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. మెరైన్ ఫిషరీస్ బిల్లు ముసాయిదా, బ్లూ ఎకానమీ పాలసీని ఖరారు చేసే ముందు మత్స్యకారులు, మత్స్య కార్మికుల ప్రతినిధులతో చర్చించాలని కోరింది. చేపల ప్రాసెసింగ్ కార్మికులు, అనుబంధ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్, అన్ని కార్మిక చట్టాలనూ సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేసింది. సముద్ర తీరం, మడ అడవులు, తీర ప్రాంతాలను రక్షించడానికి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) నియమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తీరప్రాంతాల్లో నివసించేవారు తమ ఇళ్లను ఆధునీకరణ చేసుకునేందుకు అనుమతించాలని కోరింది. మత్స్యకారుల సహకార సంఘాలకు నామమాత్రపు ధరలకు ఫిషింగ్ కోసం కేంద్ర ప్రభుత్వ నీటి వనరులను అందించాలని డిమాండ్ చేసింది.

డుబ్బుల కొలువు కళాకారుల వృత్తిని గుర్తించండి

ఈ ధర్నాలో డుబ్బుల కొలుపు కళాకారుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాటూరి దేవేందర్, జునగరి దుర్గయ్య ఆధ్వర్యంలో వందలాది మంది డుబ్బుల కొలుపు కళాకారులు తమ కళా ప్రదర్శన చేశారు. జాతీయ స్థాయిలో డుబ్బుల కొలుపు కళాకారుల వృత్తిని గుర్తించి, జాతీయ గెజిట్‌లోకి చేర్చాలని డిమాండ్ చేశారు.

వామపక్ష ప్రభుత్వాల హయాంలో

3 రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ చట్టం

- కేంద్రం అమలు చేయదు.. నిధులు ఇవ్వలేదు
- రాజ్యసభలో కేంద్ర మంత్రి కౌషల్ కిశోర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వాల పాలనలో పట్టణ ఉపాధి హామీ పథకాలు అమలు చేశాయని, అందుకు చట్టాలు కూడా చేశాయని కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌషల్ కిశోర్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేరళలో అయ్యంకాలి పట్టణ ఉపాధి హామీ కార్యక్రమం 2010 నుంచి అమలవుతుందని, త్రిపురలో త్రిపుర పట్టణ ఉపాధి కార్యక్రమం 2009 నుంచి అమలవుతుందని, పశ్చిమ బెంగాల్‌లో పశ్చిమ బెంగాల్ పట్టణ ఉపాధి హామీ పథకం 2010 నుంచి అమలవుతుందని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ పథకాలు తీసుకొచ్చినప్పుడు కేరళలో విఎస్ అచ్యుతానందన్ ప్రభుత్వం, త్రిపురలో మాణిక్ సర్కార్ ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్‌లో బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం అధికారంలో ఉన్నాయన్నారు. ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో 2020 నుంచి అమలవుతుందని, రాజస్థాన్‌లో 2022-23 బడ్జెట్‌లో ప్రకటించారని తెలిపారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం ఎటువంటి పథకాలు రూపొందించలేదని, ఆ పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాలకు కేంద్రం ఎటువంటి ఆర్థిక సాయం చేయలేదని చెప్పారు.

ఎపిలో మూడు విమానాశ్రయాల ప్రైవేటీకరణ

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి విమానాశ్రయాలను ప్రైవేటీకరించనున్నట్లు పౌర విమానయానశాఖ సహాయ మంత్రి జనరల్ వికె సింగ్ (రిటైర్డ్) తెలిపారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు సోమవారం ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా మొత్తం 25 విమానాశ్రయాలను లీజుకు ఇవ్వడం ద్వారా 2025 నాటికి రూ.10,782 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

గంగా నది ప్రక్షాళనకు ఉద్దేశించిన 'నమామి గంగ' ప్రాజెక్టు మాదిరిగా గోదావరి ప్రక్షాళనకు 'నమామి గోదావరి' ప్రాజెక్టు చేపట్టే ప్రతిపాదన లేదని జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కొనసాగుతున్న వాయిదాల పర్వం

అదానీ అవినీతిపై చర్చకు కేంద్రం అంగీకరించకపోవడంతో ఉభయ సభల్లో ప్రతిపక్షాల నినాదాలు సోమవారం కూడా కొనసాగాయి. రాజ్యసభలో కాంపిటేషన్ అమెండెమెంట్ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలను బుధవారానికి వాయిదా వేశారు.

లైంగిక వేధింపుల కేసులో

కళాక్షేత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్టు

చెన్నై : విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతిష్టాత్మక కళాక్షేత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ హరిపద్మన్‌ను సోమవారం తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రొఫెసర్ పద్మన్‌పై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్లు 354ఎ (లైంగిక వేధింపులు), 506 (నేరపూరిత బెదిరింపు), తమిళనాడు మహిళా వేధింపుల నిషేధ చట్టంలోని సెక్షన్ 4 (మహిళలపై వేధింపులక జరిమానా) కింద పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పద్మన్‌తోపాటు, ముగ్గురు రిపర్టరీ ఆర్టిస్టులు సంజిత్ లాల్, సాయి కృష్ణన్, శ్రీనాథ్ లైంగిక వేధింపులకు, కుల వివక్షకు పాల్పడుతున్నారని పేర్కొంటూ 90 మంది విద్యార్థినులు గత గురువారం తమిళనాడు రాష్ట్ర మహిళా కమిషన్ చీఫ్ ఎఆర్ కుమారికి లేఖ రాశారు. ఈ విషయంపై కుమారి మీడియాతో మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్‌లో 2008 నుంచి లైంగిక వేధింపులున్నాయని పూర్వ విద్యార్థులతో సహా అందరూ చెప్పారని, నివేదికను సిఎం ఎంకె స్టాలిన్‌కి సమర్పిస్తానని తెలిపారు. ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'పద్మన్ నన్ను లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఓసారి నన్ను తన ఇంటికి రమ్మన్నాడు. నేను నిరాకరించాను. దాంతో అతను డ్యాన్స్ డ్రామాలో ఓ కీలకమైన పాత్రని తీసుకుని వేధించేందుకు ప్రయత్నించాడు. ప్రొఫెసర్ వేధింపుల వల్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డ్యాన్స్ ప్రోగ్రామ్ నుంచి తప్పుకున్నాను' అని చెప్పారు.

మీరు మీ పని మీదే దృష్టి పెట్టండి

- సిబిఐ అధికారులకు ప్రధాని మోడీ ఆదేశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'మీరు మీ పని మీదే దృష్టి పెట్టండి' అని సిబిఐ అధికారులను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదేశించారు. సోమవారం నాడు విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సిబిఐ డైమండ్ జూబ్లీ వేడుకలను ప్రధాన మంత్రి ప్రారంభించారు. షిల్లాంగ్, పూణే, నాగ్‌పూర్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన సిబిఐ కాంప్లెక్సులను ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోనే ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్‌తోపాటు ఉత్తమ దర్యాప్తు అధికారులకు మెడల్స్ ప్రదానం చేశారు. అలాగే డైమండ్ జూబ్లీ ఉత్సవాల స్మారకార్థం పోస్టల్ స్టాంపు, నాణెం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలోనే సిబిఐ కొత్త ట్విట్టర్ హ్యాండిల్‌ను మోడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) అవినీతిపరులైన ఏ ఒక్కరినీ వదలకూడదన్నారు. అవినీతి రహిత దేశాన్ని రూపొందించడమే సిబిఐ ప్రధాన బాధ్యత అని అన్నారు. 2014 తరువాత సిబిఐ స్వేచ్ఛగా పనిచేస్తోందని అన్నారు.

డిజె వద్దన్నందుకు గర్భవతిపై కాల్పులు !

న్యూఢిల్లీ : పెద్ద శబ్దంతో పెట్టిన డిజె సంగీతానికి అభ్యంతరం చెప్పినందుకు గర్భవతి అయిన మహిళపై కాల్పులు జరిపిన సంఘటన ఔటర్ ఢిల్లీలో ఆదివారం రాత్రి జరిగింది. రాత్రి 12.15 గంటల సమయంలో సీరజ్‌పూర్‌లో గర్భవతిపై కాల్పులు జరగాయంటూ ఫోన్ కాల్ వచ్చిందని, పోలీసు బృందం అక్కడకు వెళ్ళగా, రంజు అనే మహిళ అక్కడ గాయాలతో పడి వుందని డిసిపి రవి కుమార్ సింగ్ తెలిపారు. ఆమె గొంతులో గాయమైనందున ఆమె పోలీసులకు స్టేట్‌మెంట్ ఇవ్వడానికి కుదరదని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు ఆయన చెప్పారు. కాల్పులకు తెగబడిన నిందితుడు హరీష్ అదే కాలనీలో మరో వీధిలో వుంటాడని బాధితురాలి వదిన తెలిపారు. పెద్ద శబ్దంతో పాటలు వస్తుండడం విని డిజెను ఆపాల్సిందిగా రంజు, ఆమె వదిన కోరారు. వెంటనే రంజుపై కాల్పులు జరిగాయని డిసిపి తెలిపారు.

సామాజిక న్యాయాన్ని బిజెపి ఖూనీ చేస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

వి.తిరుమలవన్ (విసికె), వైకో (ఎండిఎంకె), దేవరాజన్ (ఫార్వర్డ్ బ్లాక్)తో బాటు పిఎజిఎఎఎం జాతీయ కన్వీనర్ బిఎన్ వాఘూ, ఎఐఎఫ్ఒబిసిఈడబ్ల్యుఎ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి, బిఎఎంసిఈఎఫ్ అధ్యక్షుడు వామన్ మేష్‌రామ్, పిపిఐడి నేత బి.డి బ్రోకర్, రాజ్యాంగ పరిరక్షణ సంఘర్ష సమితి కన్వీనర్ అనిల్ జైహింద్, పివిఎస్ఎస్ఎం ఆర్గనైజర్ బహదూర్ సింగ్ లోధి, ద్రావిడర్ ఖజగం అధ్యక్షుడు కె.వీరమణి, ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్లు లక్ష్మణ్ యాదవ్, రతన్ లాల్, సూరజ్ మండల్, సీనియర్ జర్నలిస్టులు దిలీప్ మండల్ ఉన్నారు. . ఈ సదస్సుకు వందన సమర్పణ జస్టిస్ వీరేంద్ర సింగ్ యాదవ్ చేశారు.

సామాజిక న్యాయం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని సమిష్టిగా ఎదుర్కోవాల్సిన అవశ్యకత గురించి వారు నొక్కి చెప్పారు. తొలుత స్టాలిన్ మాట్లాడుతూ, ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదని, అలాగని కొన్ని రాష్ట్రాలకు సంబంధించినది కాదని, సామాజిక న్యాయం అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. భారత సమాజం నిర్మాణంతో కలిసి ఉందని తెలిపారు. కులాలు, వర్గాల సమస్యల పట్ల రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు, కాని కుల వివక్ష అనేది ముఖ్యమైన అంశమని అన్నారు. వివక్ష, అంటరానితనం, బానిసత్వం, అన్యాయం వంటి విషానికి సామాజిక న్యాయమే విరుగుడు అని పేర్కొన్నారు. సామాజిక న్యాయంలో భాగంగానే రిజర్వేషన్లు వచ్చాయని తెలిపారు. బిజెపి ఎస్‌డబ్ల్యుఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తుందని, ఇది సామాజిక న్యాయం కాదని అన్నారు. పేదలకు ఏదైనా ఆర్థిక సహాయం చేస్తే, దాన్ని ఆర్థిక న్యాయమంటారని, సామాజిక న్యాయం కాదని తెలిపారు. కొంత మంది పేదలు, అన్ని కులాల్లో పేదలతో సమానం కాదని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల్లో పేదలు ఆర్థిక, సామాజిక అణచివేతకు గురవుతున్నారని తెలిపారు. రిజర్వేషన్ ప్రతిభకు వ్యతిరేకమని చెప్పిన బిజెపి, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తుందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్న బిజెపి, 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ తీసుకురావడంలో లాజిక్ ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రతిభకు వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో 4 శాతం ముస్లిం రిజర్వేషన్ కోటాను రద్దు చేసి, 10 శాతం ఈడబ్ల్యుఎస్ కోటాను పొందుపరిచారని విమర్శించారు. బిజెపి ఓట్ల కోసమే పని చేస్తుందని, కర్ణాటకలో సామాజిక న్యాయం హత్యకు గురయిందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీలకు రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని, న్యాయ వ్యవస్థలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతల్లో కూడా ఒబిసి రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కుల జనగణన చేయాలని, గణాంకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఏర్పాటు చేశామని, అలాగే సామాజిక న్యాయం పర్యవేక్షణ కమిటీని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మేధావులు, న్యాయ నిపుణులు, అధికారులతో ఉన్న ఇలాంటి కమిటీలు అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని,

సామాజిక న్యాయం కోసం ఉద్యమం : సీతారాం ఏచూరి, సిపిఎం

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, దేశంలో సామాజిక న్యాయం హామీ కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని అన్నారు. సామాజిన న్యాయ ఉద్యమంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం వంటి అంశాలు చాలా కీలమైనవి అన్నారు. సామాజిక న్యాయమంటే రిజర్వేషన్లని అర్థం చేసుకుంటున్నారని, రిజర్వేషన్లు ముఖ్యమైనవి. అవి బయటకు కనిపించే అవకాశాలు. అయితే బయటకు కనిపించని కుల విభజన సమాజం, కుల అణచివేత వంటివి ఉన్నాయి. సామాజిక న్యాయంలో కీలకమైన రిజర్వేషన్లు ఆర్థిక సాధికారితకు నాంది పలకాలి. రిజర్వేషన్లతో వచ్చిన ఆర్థిక సాధికారిత శతాబ్దాలుగా కుల అణచివేతకు గురైన వారికి ఆత్మ గౌరవాన్ని ఇస్తుంది. దీంతో సామాజిక అణచివేతకు ముగింపు పడుతుంది. ఇది అవసరం. ఆర్థిక వృద్ధి లేనిదే ఆర్థిక సాధికారిత సాధ్యం కాదు. అయితే ఆర్థికాభివృద్ధి అనేది కొంత మందికి మాత్రమే సంబంధించినదిగా ఉంది. మిగత ప్రజానీకం దీనికి బయట ఉన్నారు. దేశంలోని 40.5 శాతం సంపద ఒక శాతం వద్దే ఉంది. కింద నున్న 50 శాతం ప్రజల్లో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉంది. దేశంలో ఈ పరిస్థితి ప్రస్తుతం దాపురించింది. సామాజిక సాధికారిత సామాజిక న్యాయానికి హామీ ఇవ్వాలి. కార్పొరేట్, కమ్యూనల్ బంధంతో ఒక రెండు రకాల దాడుల జరుగుతున్నాయని, ఒకపక్క ఆర్థిక దాడి, మరోపక్క మతోన్మాద దాడి జరుగుతోందని విమర్శించారు. దీన్ని ఎదుర్కోవల్సిన ఉందని అన్నారు. రిజర్వేషన్లు అంతం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం, సమాఖ్యవాదాన్ని పరిరక్షించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కీలకమైనదని అన్నారు. రాజకీయ, ఆర్థిక సంస్కరణ జరగాలని పేర్కొన్నారు. కుల సమాజం, వర్గ దోపిడి అంతం కావాలని అన్నారు. కుల రహిత, వర్గ రహిత సమాజం నిర్మించాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ సామాజిక భద్రత అవసరమని, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు న్యాయం జరగాలని అన్నారు. జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ రిజర్వేషన్లు కావాలని అన్నారు. వివిధ రంగాల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజశ్వి యాదవ్ మాట్లాడుతూ కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. తాము కూడా సామాజిక న్యాయంపై కార్యక్రమం నిర్వహిస్తామని, అందురూ పాల్గొనలని కోరారు. ఎస్‌పి అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ సామాజిక విముక్త సమాజం స్థాపనకు అందరం కలిసి పని చేయాలని అన్నారు. ప్రస్తుతం సామాజిక న్యాయం అవసరం ఉందని తెలిపారు.

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ అందరి కోసం దేశం అభివృద్ధి కావాలని, ఏళ్ల తరబడి అణచివేతకు గురవుతున్న, పేదరికంలో మగ్గిపోతున్నవారికి మంచి జీవితం ఇవ్వడమే లక్ష్యంగా ఉండాలన్నారు. అందుకోసం అందరం ఐక్యంగా ఉండాలని సూచించారు. సామాజిక న్యాయం కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, దాన్ని కొనసాగించాలని అన్నారు.

బిఆర్ఎస్ నేత కె కేశవరావు మాట్లాడుతూ ఎక్కువ మంది వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికకపోవడానిక గల కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యా అనేది కేవలం చైతన్య వంతులను చేయడానికి మాత్రమే కాదని, యువతలో స్ఫూర్తిని నింపడానికి ఉపయోగించాలని అన్నారు. సామాజిక న్యాయమనేది చాలా సుదీర్ఘమైన అంశమని, కనుక సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంటే మెజారిటేరిజమని పేర్కొన్నారు. మెజార్టీ ప్రజలు దేశాన్ని పాలించాలని, ఇక్కడ మెజార్టీ ప్రజలు ఉన్నా, అది సాధ్యం కావడం లేదని అన్నారు. నిర్ణయాధికారాల్లో వారు భాగస్వామ్యం కాలేకపోతున్నారని అన్నారు.

జస్టిస్ వి. ఈశ్వరయ్య స్వాగతోపన్యాసం చేస్తూ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ సోషల్ జస్టిస్ అనేది ప్రతిదీ ప్రతి ఒక్కరి కోసం ఏర్పాడిందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిక్షించుకోవాలని, దాన్ని వాస్తవంగా అమలు చేయాలని కోరారు. స్వేచ్ఛా, సమానత్వాలతో ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే రాజ్యాంగం స్ఫూర్తి అని పేర్కొన్నారు. అదే గౌరవమని అన్నారు. జనగణనలో కుల గణన చేయాలని, న్యాయ, శాసన, పరిపాలనలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు వివరాలను నిర్వహించడం కోసం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒబిసి రిజర్వేషన్, మహిళ రిజర్వేషన్లను కల్పించాలని అన్నారు.



మీకోసం

కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

జీవన సౌరభం

భయపడడం ఎప్పుడు మానేస్తామో.. అప్పుడే మన జీవితం మొదలవుతుంది.

గౌరవం



చైత్ర 4వ తరగతి చదువుతోంది. తనకు నాన్నంటే అమితమైన ప్రేమ. నాన్న ఏ పని చెప్పినా చిటికెలో చేసేది. కానీ ఒక విషయంలో మాత్రం నాన్న మీద కోపంగా ఉండేది. నాన్న అంటే కొంచెం భయం కూడా ఉండడంతో ఆ విషయం చెప్పకపోయేది.

చైత్ర ఇంట్లో ఓ పెద్ద కుర్చీ ఉంది. అందులో వాళ్ల నాన్న మాత్రమే కూర్చుంటాడు. "నేనూ ఆ కుర్చీలో కూర్చుంటాను.. నువ్వు నాన్నతో చెప్పు" అని అమ్మతో గొడవపడేది చైత్ర. "నాన్న వయసులో పెద్దవాడు కదా తల్లీ! కింద కూర్చొని భోజనం చేయాలంటే కష్టంగా ఉంటుంది." అని అమ్మ చైత్రకు సర్దిచెప్పేది. కాని చైత్ర మనసులో ఆ కుర్చీ మీద కూర్చొని తినాలని అనుకునేది.

ఓ రోజు చైత్ర వాళ్ల ఇంటికి తాతయ్య వచ్చాడు. పనికి వెళ్లిన నాన్న సాయంత్రం ఇంటికి రాగానే తన తండ్రి బాగోగులు అడిగి తెలుసుకున్నాడు. రాత్రి భోజన సమయంలో చైత్రతో పాటు నాన్న కూడా కిందనే కూర్చొని భోజనం చేయడంతో చైత్ర ఆశ్చర్యపడింది. 'ఎప్పుడూ కుర్చీపై కూర్చొని తినే నాన్న ఈ రోజు కింద కూర్చున్నాడు' అని మనసులో అనుకుంది. తాతయ్య వారం రోజులు ఉండి వెళ్ళాడు. ఆ వారం రోజులూ నాన్న కింద కూర్చొనే భోజనం చేశాడు.


'అమ్మా! అమ్మా! నాన్న కింద కూర్చొనే భోజనం చేశాడు ఏంటి.' అని అడిగింది.

'చైత్రా, మన ఇంటిలో కూర్చోటానికి ఒకటే కుర్చీ ఉన్నది. అది నీకు తెలుసు కదా!. తాతయ్య వయసులో నాన్న కన్నా పెద్దవారు. కింద కూర్చోలేరు. పెద్దలను మనం గౌరవించాలి. అందుకే నాన్న గారు కింద కూర్చున్నారు' అని చెప్పింది. దాంతో చైత్రకు నాన్నపై ఉన్న కోపం పోయింది. ఇంటికి పెద్దలెవరు వచ్చిన వారితో ప్రేమగా మాట్లాడుతూ గౌరవించసాగింది. చైత్రలో వచ్చిన మార్పుకు తల్లి చాలా సంతోషించింది.

- ముక్కాముల జానకీరామ్
63053 93291

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.



నేను గీసిన బొమ్మ



- ఎస్‌కె భానో,
7వ తరగతి,
గీతాంజలి స్కూలు,
రామిరెడ్డి నగర్,
గుంటూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మంచు కురిసే కాశ్మీరంలో ...
వెలుతురు సోకని ఒక ఊరు

కాశ్మీర్.. ఎన్నో సుందర దృశ్యాల నెలవు.. సైన్యం, పౌరుల జీవితాల గురించి, సంఘర్షణల గురించి ఎప్పుడూ వింటూనే ఉంటాం. కాని అక్కడి చిన్నారులు, మహిళల గురించి ఎవరికీ పట్టదు. విద్య, ఉపాధికి దూరమైన జీవితాల గురించి కాదు ఇప్పుడు మనం చెప్పకునేది. చిమ్మ చీకట్లో మిణుకు మిణుకుమంటున్న వెలుగులో పురుడు పోసుకునే ఎన్నో ప్రాణాల గురించి. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం కల్పించిన అరకొర సౌకర్యాలతో నిత్యం చస్తూ బతుకుతున్న ఎంతోమంది తల్లీబిడ్డల కన్నీటి వెతలివి.



మంచు దుప్పటి కప్పుకున్న ఆ ప్రాంతం చూపరులకు ఎంతో ఆకర్షణీయంగా కనపడుతుంది. దగ్గరకు వెళ్లి చూస్తే గాని అక్కడి ప్రజల సాదకబాధలు అర్థం కావు. దేశంలోనే అత్యంత సుందర ప్రాంతమైన కాశ్మీరీ లోయలో ఉన్న ఆ గ్రామం, సరిహద్దు రేఖకు చాలా తక్కువ దూరంలో ఉండడమే పెద్ద నేరం. వజిరిథాల్ అని పిలవబడే ఆ గ్రామం చేరుకోవాలంటే బుద్గాం గ్రామ పంచాయతికి వెళ్లాలి. శ్రీనగర్ నుంచి 10 గంటలు ప్రయాణం చేయాలి. 5 గంటల ప్రయాణం గురేజ్ లోయ గుండానే సాగుతుంది. ఆరేడు చెక్‌పోస్టులు దాటాలి. ఆపై ఓ పదినిమిషాలు కాలినడకన చేరుకుంటే గాని ఆ గ్రామం చేరుకోలేం. మొత్తం 24 కుటుంబాలే జీవిస్తున్న అక్కడ మట్టితో అతికిన చెక్కముక్కల గోడలే ఇంటి పరిసరాలు. అటువంటి గ్రామంలో.. మనుగడే కష్టమైన పరిస్థితుల్లో గర్భిణీలు ప్రసవ



సమయంలో పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

అటువంటి చోట 22 ఏళ్ల షమీనా పురిటినొప్పులతో బాధపడుతోంది. మూడు రోజులుగా అదే బాధ. కొన్ని రోజులుగా అక్కడ సూర్యకాంతి కూడా లేదు. పగలు, రాత్రి తేడా లేదు. చిమ్మచీకట్లోనే నివసిస్తున్నారు. సోలార్ ప్యానెల్స్ చార్జీ చేసి లేవు. మిణుకుమిణుకు మంటూ కిరోసిన్ దీపం వెలుగుతోంది అంతే.. ప్రసవ వేదన అనుభవిస్తున్న షమీనాను పరామర్శించేందుకు గ్రామంలోని కొందరు ఆడవాళ్లు తమతో చిన్న చిన్న లాంతర్లు తీసుకొచ్చారు. ఆ వెలుగులోనే ఆమెకు ప్రసవం చేయాలని వారు నిర్ణయించుకున్నారు. వైద్యుడు లేడు.. పరికరాలు లేవు.. వెలుగు లేదు.. ఇటువంటి పరిస్థితుల్లోనే తన గ్రామంలో ఎంతోమంది ఆడవాళ్ల వలె షమీనా తన రెండో బిడ్డకు జన్మనిచ్చింది.

బిడ్డ పుట్టిన నాలుగు నెలలకు గ్రామంలో సూర్యకాంతి ప్రసరించింది. ఆ కాంతి కోసం ఎన్నాళ్ల నుండో వేచి ఉన్న గ్రామస్తులు ఒక్కొక్కరిగా తమ చంటి బిడ్డలను తీసుకుని ఆరుబయట కూర్చొంటున్నారు. వారిలో షమీనా కూడా ఉంది. ఇంటిబయట ఓ కొయ్య దుంగపై ఆమె కూర్చొని వుంది. పెద్ద బిడ్డను కూడా తనతో పాటు కూర్చొబెట్టుకుంది.

'మా ప్రాంతంలో మూడేళ్ల క్రితమే అంటే 2020 నుండే సోలార్ ప్యానళ్లు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి వరకు మేము లాంతర్లు, బ్యాటరీతో నడిచే చిన్న లైట్లనే ఉపయోగించేవాళ్లం. అయితే సోలార్ ప్యానళ్లు వచ్చినా మా పరిస్థితుల్లో ఏం మార్పు లేదు. కారణం ఇక్కడ ఎక్కువశాతం ఎండ ఉండదు. ఏడాదిలో మూడొంతులు మంచు వాన కురుస్తుంది. సూర్యుడు ఎప్పుడో కనిపిస్తాడు. మబ్బులు కమ్మేసి అంతా చీకటిగా ఉంటుంది' అంటూ తన ప్రాంతం గురించి చెబుతుంది షమీనా.

ఈ గ్రామానికి పక్కనే ఉన్న ఇతర గ్రామాల్లో జనరేటర్ల ద్వారా ఏడు గంటల విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. కాని ఇక్కడ మాత్రం ఎండ వచ్చే రోజుల్లో 12 ఓల్టుల బ్యాటరీని సోలార్ శక్తి ద్వారా చార్జ్ చేసుకుంటున్నారు. దాంతో రెండు లైట్లు, రెండు ఫోన్లు చార్జింగ్ అవుతాయి. అవి రెండు రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ మబ్బులు ఎక్కువగా ఉండి, మంచు వాన తగ్గకుండా ఉంటే చార్జింగ్ అయిపోయి గ్రామమంతా చీకట్లోకి వెళ్లిపోతుంది.



అరకొర సదుపాయాలు, అందుబాటులో లేని వైద్యం కారణంగా దశాబ్దాల తరబడి 72 ఏళ్ల .జానీ బేగమే గ్రామస్తులందరికీ ప్రసవాలు చేస్తోంది. ఆమె చనిపోయిన తరువాత తమ బిడ్డల ప్రసవాల్లో ఎవరు సాయం చేస్తారని మధ్యవయసు అమ్మలు భయపడిపోతున్నారు. గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉన్నా వైద్యుల కొరత వల్ల అక్కడ సాధారణ ప్రసవాలు కూడా జరగవు.

'నా మొదటి ప్రసవమప్పుడు హాస్పటల్‌కు వెళ్లాను. అయితే అక్కడ ఎవరూ లేని కారణంగా ఇంటికి తిరుగుముఖం పట్టాను. రెండు గంటలు ప్రయాణిస్తే గాని గ్రామానికి రాలేము. ఈలోపే నాకు నొప్పులు మొదలయ్యాయి. మార్గమధ్యలో ఓ సఫాయి కార్మికురాలు సాయంతో ప్రసవం జరిగింది. బిడ్డ పుట్టక ముందు గాని, పుట్టిన తరువాత గాని ఇంతవరకు ఒక్క డాక్టరూ నన్ను పరీక్షించిందీ లేదు. నాలాంటి వాళ్లు ఇక్కడ ఎంతోమంది' అంటూ చెబుతోంది షమీనా.

'35 ఏళ్లుగా నేను ఇక్కడ ప్రసవాలు చేస్తున్నాను. ఒక్కోసారి పరిస్థితి చాలా ప్రమాదకారంగా తయారవుతుంది. బిడ్డ కడుపున పడ్డ దగ్గర నుండి తల్లికి సరైన వైద్య సదుపాయాలు అందవు. దీంతో ఒక పక్క భయం వెంటాడుతున్నా ఈ పని చేస్తున్నా. గర్భిణీలందరూ చాలా బలహీనంగా ఉంటారు. తల్లీబిడ్డ బతికించుకోవాలన్న తాపత్రయం ఉన్నా ఇద్దరు ప్రాణాలు దక్కిన సందర్భాలు చాలా తక్కువ' అంటూ ఆవేదనగా చెబుతోంది జానీ బేగం.

కొండలు, గుట్టలు, వాగులు, వంకల్లో నివసించే ప్రజల దీన గాథలు, ప్రసవ వేదనలు అప్పుడప్పుడైనా వార్తల్లో చూస్తాం. కాని నిత్యం సంఘర్షణలతో తల్లడిల్లే కాశ్మీర్ లోయలో ఎన్నో గ్రామాల్లో జీవిస్తున్న ప్రజల సాదకబాధలు మన వరకూ రావు. పుట్టుక, చావు, జీవితం వారికి పెద్ద పోరాటం.. తల్లులు, బిడ్డలు, భార్యలు, భర్తలు ఎవరికివారే నిత్య సంఘర్షణ జీవులు..

చెన్నై సూపర్‌కింగ్స్ బోణీ

లక్నోపై 12 పరుగుల తేడాతో గెలుపు.. రుతురాజ్ మరో అర్థశతకం

చెన్నై: చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ బోణీ కొట్టింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు 12 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 217పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 7 వికెట్లు నష్టపోయి 205 పరుగులే చేయగల్గింది.

తొలుత చెన్నై ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్(57) అర్ధసెంచరీకి తోడు మరో ఓపెనర్ డెవాన్ కాన్వే(47) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 9.1 ఓవర్లలో 110 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో రుతురాజ్ గైక్వాడ్(57) ఈ ఐపిఎల్‌లో రెండో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కృష్ణప్ప గౌతమ్ వేసిన 5వ ఓవర్‌లో మూడు సిక్సర్లు కొట్టిన రుతురాజ్... కృనాల్ పాండ్యా వేసిన 8వ ఓవర్‌లో సింగిల్ తీసి అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. కేవలం 25 బంతుల్లోనే 2ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో అర్ధ శతకాన్ని బాదాడు. ఆ తర్వాత శివం దూబే(27), మొయిన్ అలీ(19)కూడా బ్యాటింగ్‌లో రాణించారు.


ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మొయిన్ అలీ(4/26)

చివర్లో అంబటి రాయుడు(27) ధాటిగా ఆడగా.. మార్క్ వుడ్ వేసిన ఆఖరి ఓవర్‌లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ(12) వరుసగా రెండు సిక్సర్లు బాది ఔటయ్యాడు. లక్నో బౌలర్లలో రవి బిష్ణోయ్, మార్క్ వుడ్ తలా మూడు వికెట్లు తీయగా.. ఆవేశ్ ఖాన్‌కు ఒక వికెట్ లభించింది.

ఛేదనలో లక్నో జట్టుకు అదిరే ఆరంభం లభించింది. కెప్టెన్ కేఎల్ రాహుల్- మయర్స్(53) కలిసి తొలి వికెట్‌కు 5.3 ఓవర్లలోనే 79పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మయర్స్ కేవలం 21 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత లక్నో జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో పూరన్(32) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించాడు. మొయిన్‌కు నాలుగు, దేశ్‌పాండేకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మొయిన్ అలీకి లభించింది.

5వేల క్లబ్‌లో ధోని

చెన్నై కెప్టెన్ ఎంఎస్ ధోని ఐపిఎల్‌లో అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. 5 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. మార్క్ వుడ్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాది అతను ఈ రికార్డుకు చేరుకున్నాడు. ఇప్పటి వరకు ఐపిఎల్‌లో ఐదుగురు 5వేల పరుగులు పూర్తి చేసుకున్న బ్యాటర్లలో విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, వార్నర్, రోహిత్ ఈ ఫీట్ సాధించారు.

ఐపిఎల్‌లో నేడు..
ఢిల్లీ × గుజరాత్
(వేదిక: ఢిల్లీలో, రా.7.30గం॥లకు)

మియామీ టైటిల్ విజేత మెద్వదెవ్

ఫైనల్లో సిన్నర్‌పై గెలుపు

న్యూయార్క్: మియామీ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రష్యాకు చెందిన టాప్‌సీడ్ డానియెల్ మెద్వదెవ్ గెలుచుకున్నాడు. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో మెద్వదెవ్ 7-5, 6-3తో జన్నిక్ సిన్నర్(ఇటలీ)పై వరుససెట్లలో నెగ్గాడు. తొలిసెట్‌లో హోరాహోరాగా సాగినా.. రెండో సెట్‌లో మెద్వదెవ్ ప్రత్యర్థిపైగా ఆధిపత్యం చెలాయించాడు. దీంతో మెద్వదెవ్ నాల్గోసారి మియామీ టైటిల్‌ను కైవసం చేసుకోవడంతోపాటు ఓవరాల్‌గా 19వ మేజర్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూయార్క్, సౌత్ ఫ్లోరిడాలోని హార్డ్‌రాక్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. టైటిల్ విజేతగా నిలిచిన మెద్వదెవ్‌కు సుమారు 1.3మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది.



జకోవిచ్‌కు అగ్రస్థానం..

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఏటిపి) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకాడు. గత వారం దుబాయ్ ఓపెన్ టైటిల్ విజేతగా నిలిచిన అల్కరాజ్ జకోవిచ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరుగా.. ఏటిపి సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అల్కరాజ్‌ను వెనక్కి నెట్టి జకోవిచ్ మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌కు చెందిన రోహన్ బొప్పన్న డబుల్స్‌లో 13, సింగిల్స్‌లో సుమిత్ 372ర్యాంక్‌లో నిలిచారు.

ఏటిపి టాప్-10 ర్యాంకింగ్స్..

1. నొవాక్ జకోవిచ్(సెర్బియా) : 7160పాయింట్లు
2. కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్) : 6780 „
3. స్టెఫానొస్ సిట్సిపాస్(గ్రీక్) : 5770 „
4. డానియెల్ మెద్వదెవ్(రష్యా) : 5150 „
5. కాస్పర్ రూఢ్(నార్వే) : 5005 „

విలియమ్సన్‌కు గాయం

ఐపిఎల్‌కు దూరం



అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఐపిఎల్ టోర్నీ మొత్తానికి దూరయ్యాడు. కుడి మోకాలికి పట్టీతో, రెండు కర్రల సాయంతో నిల్చొని ఉన్న ఫొటోను విలియమ్సన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 'థాంక్యూ గుజరాత్ టైటన్స్. గత రెండు రోజులుగా నాకు అన్నివిధాలా సపోర్ట్ చేసిన మంచి మనుషులకు థాంక్స్. కాలి గాయం నుంచి కోలుకునేందుకు స్వదేశం బయలుదేరుతున్నాను' అని క్యాప్షన్ రాశాడు. ఆ పోస్ట్ చూసిన ఫ్యాన్స్ 'విలియమ్సన్ తొందరగా కోలుకో' అంటూ కామెంట్లు పెడుతున్నారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా ఈ కివీస్

మత్స్యకార కూతురుగా



ఎన్టీఆర్-కొరటాల శివ కాంబోలో తెరకెక్కబోతున్న ఎన్‌టిఆర్-30 చిత్రం రెగ్యులర్ షూట్ మొదలుపెట్టింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కి జోడిగా నటిస్తున్న జాన్వీ కపూర్ లుక్‌ను ఇటీవల విడుదలచేశారు. అయితే ఈ సినిమాలో ఆమె ఏ పాత్రలో నటిస్తుందోనని శ్రీదేవి అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం జాన్వీ ఈ చిత్రంలో ఓ మత్స్యకారుని కూతురిగా కనిపించనుందని తెలుస్తోంది. ఫస్ట్ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌పై యాక్షన్ సన్నివేశాల చిత్రకరణ చేపట్టిన కొరటాల సెకండ్ షెడ్యూల్ నుండి ఎన్టీఆర్-జాన్వీలపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారని తెలుస్తోంది.

'బలగం' చిత్రానికి మరో అవార్డు

వేణు దర్శకత్వంలో తెరకెక్కిన 'బలగం' చిత్రానికి అంతర్జాతీయ అవార్డులు క్యూ కడుతున్నాయి. ఇటీవల ఉక్రెయిన్‌లో జరిగిన ఓంక్యో ఫిల్మ్ అవార్డ్సులో ఉత్తమ డ్రామా ఫీచర్ ఫిల్మ్ అవార్డును గెలుచుకున్న ఈ సినిమా తాజాగా మరో 4 అవార్డులను సొంతం చేసుకుంది. 'వాషింగ్టన్ డిసి ఇంటర్నేషనల్ సినిమా ఫెస్టివల్'లో ఉత్తమ ఫీచర్ డైరెక్టర్ (వేణు యెల్దండి), ఉత్తమ నటుడు (ప్రియదర్శి), ఉత్తమ నటి (కావ్య కళ్యాణ్‌రామ్), ఉత్తమ కథనం (వేణు యెల్దండి) అవార్డులను గెలుచుకుంది. ప్రియదర్శి, కావ్య కళ్యాణ్‌రామ్, మురళీధర్ గౌడ్, జయరామ్, రూప, రాచ రవి తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని దిల్ రాజు బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి హన్షిత రెడ్డి నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

కొత్త రిలీజ్ డేట్‌లో 'ఉగ్రం'



అల్లరి నరేష్ -విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రాబోతోన్న 'ఉగ్రం' చిత్రం కొత్త విడుదల తేదీ ప్రకటించారు. గతంలో ప్రకటించినట్లుగా ఏప్రిల్ 14, 2023న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాల వల్ల విడుదల తేదీ వాయిదా పడి మే 5, 2023న రిలీజ్ కానున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు ఓ పోస్టర్‌ను కూడా పోస్ట్ చేశారు.

గోవాలో నాని-30 షూటింగ్

జనవరిలో నాని 30వ చిత్రం ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. 'సీతా రామం' నటి మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శౌర్యవ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా తదుపరి షెడ్యూల్ గోవాలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ 40 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ సినిమాలో నాని కూతురిగా బేబీ కియారా ఖన్నా నటిస్తోంది. వైరా ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కెఎస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68